బృందావన ప్రసూనము. 11

# కాళరాత్రి

## (కోస్తాంధ్ర - ఉప్పెన)

ది 19-11-1977

రచన :


కవిశేఖర

గురుజాడ రాఘవశర్మ



బృందావన ప్రచురణములు

మచిలీపట్టణము

బృందావన ప్రసూనము. 11

ప్రథమ ముద్రణము :

1000 ప్రతులు

1979, నవంబరు

ప్రచురణ :

బృందావన ప్రచురణములు

మచిలీపట్టణము

సర్వస్వామ్యములు రచయితవి

వెల : రూ. 5-50

ముద్రణ : విజయ ప్రెస్. విజయవాడ-2.

# విషయసూచిక


పుట

1. పరిచయము 5

2. 'మున్నుడి' 9
శ్రీ డాక్టరు ప్రసాదరాయ కులపతి, యం.ఏ.పి.హెచ్.డి గారు
- గుంటూరు.

3. కరుణరస కావ్యము 11
కళాప్రపూర్ణ డా॥ దాశరథి గారు,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాస్థానకవి.

4. 'ధన్యవాదాలు' 11
మాజీ విద్యా, సాంస్కృతిక శాఖామాత్యులు,
యం.యల్.ఏ., శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు

5. కాళరాత్రి (పద్య సంపుటి) 13

6. అనుబంధములు

i) 22 గాలివానలు, వర్షపాతములు, ఉప్పెనలు 27

ii) 1864-11-1 ఉప్పెననాటి సీసమాలిక
కీ. శే. రాయభట్టు వీరరాఘవ కవి కృతము 61

7. ఆంధ్ర - అద్భుత సృష్టి 75
మాజీ కృష్ణాజిల్లా కలెక్టరు, శ్రీ ఐ. వి. యస్. రెడ్డిగారి
వ్యాసమునకు తెలుగు స్వేచ్ఛానువాదము.

మచిలీపట్టణ రాబర్టుసన్‌పేట చౌకు మధ్య నిర్మింపబడిన స్థూపము (చిత్రము)



1864 ఉప్పెనకు గురియైన మృత జీవుల స్మారక చిహ్నము.

శ్రీ ఎ. వి. యస్ రెడ్డి
కలెక్టరు, మరియు జిల్లా మేజిస్ట్రేటు
కృష్ణా జిల్లా.

# అభినందన

భగవంతునిలీలలు అనంతములు. మానవుని హిమవన్నగాలపై అధిష్టించనూ గలఁడు. పాతాళ గహ్వర సీమలో పడద్రోయనూ గలడు. అమృతమును వర్షించి జీవులను చిరంజీవులను వేయగలడు. బడబాగ్నిని ప్రజ్వలింపఁజేసి జీవకోటిని భస్మీపటలము చేయఁగలడు. ప్రళయ, ప్రణయములను, సుఖ, దుఃఖములను సమదృషితో స్వీకరించ గల్గినవారే తపస్వులు, మహర్షులు. కానిసామాన్యమానవులు సుఖములు కల్గినప్పుడు పొంగి పోవుట, దుఃఖములు కలిగినప్పుడు వ్యాకులము చెంది నిర్వీర్యులగుట సహజము. జల ప్రళయము కరాళ నృత్యము చేసిన 1977 నవంబరు 19 వ తేదీ రాత్రి "కాళరాత్రి". అసమాన ధైర్యసాహసములు. మనస్థైర్యమును ప్రకటించు వారిని కూడా ఆశ్చర్య భయ భ్రాంతులనుగా చేసి, నిశ్చేష్టులను చేసిన భయంకర దృశ్యం. మానవులు ఎదుర్కొనలేని మహా ప్రళయం, శతాబ్దానికొకసారి వస్తున్నదని తెలుస్తుంది. కాని వేలాది మనుష్యులను, పశువులను, తుడిచిపెట్టి అనేక గ్రామాలను భూమట్టం చేసిన ఆ పెను ఉప్పెన చేసిన భీభత్సం, మరువలేం. కాకలు తీరిన స్వాతంత్ర్య సమరయోధులు పరిపక్వమైన కవి పండితులు, కృష్ణా మండలమునకు చిరపరిచితులైన కవిశేఖర శ్రీగురజాడ రాఘవశర్మగారు ఆ జలప్రళయ భీభత్సాన్ని కన్నులకుఁగట్టినట్లు "కాళరాత్రి" యను పద్య కావ్యముగా

రచించి భావితరాల భారతీయులకు చరిత్రాధారముగా నుండునట్లు తీర్చిదిద్దినారు. వారికి నా అభివందనములు.

కాళరాత్రి గడచి పోవునా, తెలవారునా, సూర్యుడుదయించునా. సర్వనాశనమైన ఈ సీమలో మరల ఆశలు చిగురించునా, ప్రజా జీవితము చక్కబడునాయని భయభ్రాంతులైన వారిని ఓదార్చి. వేలాది మందికి ఆశ్రయము కల్పించి, తిండి, బట్ట, తదితర సదుపాయములను కల్పించి, తిరిగి తమ తమ గ్రామములకు తరలి పోవుటకు ఆత్మ స్థైర్యమును కల్పించిన వందలాది స్వచ్ఛంద సంస్థలు, పదివేల ఇళ్ళను నిర్మించి, విద్యుత్, మంచినీరు, రోడ్లు, రవాణా మొదలైన సదుపాయములను కల్పించిన ప్రభుత్వ కృషి అనిర్వచనీయము. 'న భూతో న భవిష్యతి' అన్న అతిశయోక్తిగాదు. ఈ నాడా గ్రామములు చూపరులను ఆశ్చర్యచకితులను చేస్తున్నవి. నవజీవం నాట్యం చేస్తున్నది. ఇట్టి పరిణామానికి పరోక్షమైన కారణం ఉప్పెన. "కాళరాత్రి" గడిచి ఇప్పుడవతరించిన పునర్నిర్మాణ క్రమమును గూడా నాక కావ్యముగా రచించి, మృత్యు ముఖముగా నుండి బయట పడి మూగవోయిన అమాయిక ప్రజలను ఆదుకొనుటకు, పునరుజ్జీవనమునకు, స్వచ్ఛంద సంస్థల త్యాగనిరతిని, ప్రభుత్వ సంస్థల హృదయ పూర్వక విధి నిర్వహణను వివరించెదరని ఆశించుచున్నాను.

(Sd.) ఎ. వి. యస్ రెడ్డి.

# కృతజ్ఞత

ధీరులు, ప్రజాసేవానిమగ్నులు, రాచకార్య నిర్వహణా ధురీణులు, ఋజు వర్తనులు అగు కృష్ణాజిల్లా కలెక్టరు శ్రీ ఎ. వి. యస్. రెడ్డిగారు, నా యీ "కాళరాత్రి" గ్రంథమును సావకాశముగా విలోకించి, అభిమాన పూర్వకముగ హృదయంగమముగా వెలువరించిన "అభినందన" కు నా హృదయపూర్వక ధన్యవాదాలు.

గురుజాడ రాఘవశర్మ

# కృతజ్ఞత

నా 'కాళరాత్రి' గ్రంథమును తిలకించి, ప్రశంసలతో ముద్రణ వగైరాలకు తగు ధన సహాయ మొసంగ తోడ్పడిన, మాజీ విద్యా సాంస్కృతిక శాఖామాత్యులు, ప్రస్తుత శాసనమండలి సభ్యులగు శ్రీ మండలి వెంకట కృష్ణారావున కెంతయు నా హృదయ పూర్వకాభినందనలు.

గురుజాడ రాఘవశర్మ

Prof. M. R. APPA RAO, M.A., M.P.
Member, A. I. C. C. (I)
Honorary Professor of Theatre Arts,
Andhra University
Chairman:
Advisory Board, P. G. Courses
Nuzvid

Vuyyur
Garden
Nuzvid,
Krishna Dist.
(A. P.)
13—8—81

# కాళరాత్రి

స్వాతంత్ర్య సమర యోధులు, కవిపుంగవులు అయిన శ్రీ గురజాడ రాఘవశర్మగారు 1977లో జరిగిన, దివి సీమలో జరిగిన విలయతాండవాన్ని కాళరాత్రిలో కన్నులకు కట్టినట్లుగా చూపారు.

యావత్ప్రపంచాన్ని భయభ్రాంతులను చేసింది అచటి ఉప్పెన. ఆ విషయాన్నే కవిగారు 'కాళరాత్రి' అనే కరుణరసాత్మక కావ్యంగా ఆవిష్కరించారు. ప్రత్యక్షంగా ప్రళయోగ్ర దారుణ భయంకర దృశ్యాల్ని గాంచిన శర్మగారు మానసవీధిలో కలత చెందారు.

'త్రావ, నీరచట లేదు, తలదాచుకొనగ
కొంప లేదు, తినగ, కూడు లేదింత
ఆలించి రవాల ఆక్రందనమ్ము
దేవుడే విని, దిగిరావలె' నన్నవారి యాక్రందనము

వింటుంటే ఒళ్ళు జలదరిస్తుంది.

'చిందరవందరై పడిన జీవుల, కన్గొనబోయి, వారి యా
క్రందన ఘోష నట్టె వినగా భరియింపగలేక నిల్చి'

ఎందరెందరో దిగులుపడినట్లు వర్ణించారు. యథార్థమంతియే గదా! ఆ ప్రళయబీభత్స దృశ్యాన్ని అపుడు చూడలేక ఇపుడు ఎవరైనను ఈ కావ్యంలో చూడగల్గుతారు.

శ్రీ రాఘవశర్మగారు ప్రజాసేవకుడు. దేశభక్తి తత్పరులైన శ్రీ శర్మగారు, తన మాతృభూమికి కలిగిన దుస్థితిని చూచి, భరింపలేక తమ ఆవేదనను గ్రంథరూపంలో ఆవిష్కరించారు. దీనజనసేవాసంకల్పమునకే 'కాళరాత్రి' దోహదమీయగలదని ఆశించుచున్నాను.

M. R. APPA RAO

## కృతజ్ఞత

పూజ్యులు, సాంస్కృతిక మేధాసంపన్నులు, రసార్ద్ర హృదయులు, ఉన్నతస్థాయి నలంకరించిన నిరాడంబరులు మించి మా గురుజాడ (ఉయ్యూరు) ప్రభువులగు శ్రీ యం. ఆర్. అప్పారావుగారు 'కాళరాత్రి' గ్రంథమును సావలోకముగా పరిశీలించి సుప్రశంసావాక్య సంచయమున నలరించిన వారికి నాహృదయపూర్వక ధన్యవాదములు.

మచిలీపట్టణం
18-8-81

ఇట్లు
గురుజాడ రాఘవశర్మ

# కాళరాత్రి

ఉ॥ కదలదుగా కలమ్మది, వికావికలై సుడిగొన్న, దారుణా
న్పదమగు, దీనమౌ చరిత వ్రాయదలంపఁగఁ బల్క నేరికిన్
మెదలదు నోరు, మూతవడి, మృత్యుముఖమ్మున, ప్రాణమొడ్డి, హీ
నదశను, దిక్కుగానని, జనమ్ముల దుస్థితి, పొందు దుర్గతిన్. 1

ఉ॥ నిలువగ బెట్టు నీడయు, కనీసము పందిరి, కట్టుబట్ట, ఆ
కలికి, రవంతగంజి, మెయిఁ గప్పగ పాతయులేక, సర్వమున్
జలనిధి కప్పగించిన, అనాథుల దుస్థితి గూర్చి, నేడిటన్
పలుకగ తప్పదౌట, నుడువన్, సరితోడ్పడుమమ్మ! భారతీ! 2

॥ అది ప్రళయోగ్రదారుణ భయంకర దృశ్యము, వార్ధిపొంగి, ప్ర
ళ్లదమగు, వాతపీడిత, తరంగములన్ సుడివారుచున్, మహా
పదల జనాళిముంచి, వెన ప్రాణములన్ బలిగొన్న దుస్థితిన్
మదిఁదలపన్ విచారమగు, మాటల జెప్పగరా దొకింతయున్. 3

॥ చీకటికోణమై, పగలు, చెందొవకాంతి, భయస్వరూపమై
ఆకసమల్లె, మృత్యుముఖమైనటు లుప్పెన సూచకమ్ముగా
భీకర కాళరాత్రి వడివీచు, ప్రభంజన ధాటికోర్తుమే!
చేకుఱునయ్య! భద్రమను చింతల మున్గిరి, సర్వులా నిశిన్. 4

5 చ॥ ప్రళయపయోధిలోన, బడబాగ్ని జనించి, ప్రచండ వాయునం
కలిత జలోర్మికాతతి, ప్రగాఢగతిన్ బయిలేచి, గ్రామ సీ
మల, జన జంతుజాలముల మారణ కేళిగ, కాళి, వేయి జి
హ్వల, బలిగొంచు, చేసెను విహారము, క్షార జలప్రవాహమై.

6 చ॥ చెలియలకట్టదాటడని, చెప్పుదురే! కరుణా సముద్రు, డా
జలముల తే(డు? దాటుచు, నిజస్థలి, దూటుచు, ధాటి, పేదకొం
పల, కల సంపదల్, పశుల, పాపల, నిర్దయ, యేళ్లు, కోళ్లనున్
గలుపుచు, నేకమై, ప్రళయ కాల జలార్ణవమై స్రవింపగన్!

7 ఉ॥ కూకటి వ్రేళ్ళతో కదలి, కూలబడెన్ తరులున్, గృహమ్ములున్,
పాకలు, మూలమట్టముగ, ధ్వంసమయెన్, గతికానకే, ప్రజా
నీకము, తల్లడిల్లె, రమణీయ వనమ్ములు రూపఱెన్, మహా
శోకవితప్తులై, జనుల క్షోభ వచింపగ శక్యమే! కటా!

8 ఉ॥ కన్నులు విచ్చిచూడ, పొడగానని, భీకర కాళరాత్రిలో
మిన్నులుమన్ను లేకమయి, మృత్యు విహారముసాగి, జీవులే
తెన్నున, బైట రాగలుగు, దిక్కులభింపక; అంత్య కాల మా
సన్నముగాగ, కొట్టుకొను, సన్న యెలుంగు, వినంగ, లే, రొరుల్!

9 ఉ॥ ఆపదలెంత వారలకొకప్పుడు, సంభవమౌట, నైజమే
పాపలు, పిల్లలంచనక, పల్లెజనాళికి, మూక ఉమ్మడిన్
చేపడునయ్యా, ఆపదలు, చేకురుగా, కిటు, నాశమౌటకే
పాపము! కాంచరాని, దురవస్థ ఘటిల్లె, మరేది దిక్కగున్!

సీ॥ ఎడపెడ వీచెడి, సుడిగాలి పెనుమ్రోత
తట్టుకొనుచు, చెట్లు తప్పుకొనుచు
ఉండుండి, కెరటాల, ఊపుల నిలద్రొక్కు
కొంచు, పట్టుల జిక్కు కొంచు, మధ్య
చుట్టుముట్టిన నీరు, చెట్టెక్కి ప్రాణముల్
నిలుపు కొంచును, శ్వాస గలుపుకొంచు
ఇంటి కప్పులనెక్కి, యిల్లుకూల ప్రవాహ
గతి, మున్గి తేలుచు, గాలి పీల్చు
తల్లి, తండ్రి, భార్య, తనయు డేమయ్యెనో
తలచుకొనెడి వ్యవధి, తమకు లేక
తామె, తల్లడిలుచు, తమ ప్రాణముల్ నిల్వ
పెనగులాడు, దీనజనుల గంటె! 10

ఉ॥ వేనకువేల్ జనాళి, తెలివిన్ మసిజేసి, హరింప, ప్రాణముల్,
పీనుగు పెంటలై, ప్రళయ వీచికలన్, బడి, ముళ్ళడొంకలన్
మ్రానుల, దూటిదాటి, వడి మైళ్ళకొలంది, స్థలాలవీడి, అ
దీనుల తొంటి రూపుచెడి, దిక్కెది! మారణకేళి రాత్రిలో. 11

చ॥ వికట వినాశ హేతువగు, విస్తృత భీకరమైన, ఉప్పెనం
దొకరికి, నొక్కరున్ గలసి, యోపిక తట్టుకొనంగరాదు, చీ
లిక, యనివార్యమై, మృత కళేబరముల్, వడి, జారగా, వికా
వికలయె, యంగముల్, తమకవే, యొక యొడ్డునబట్టి గుట్టలై. 12

ఉ॥ చెట్టునపుట్ట కొక్కరయి, చిందరవందరయెన్ కుటుంబముల్
చెట్టలఁ బొల్పడెన్ మృత కళేబరముల్, జలధి ప్రవాహికిన్
గుట్టల కట్టలన్ పొదల, గొట్టుకపోయె, రవంత పోలికల్
పట్టగరాక, రూపుచెడె, వారికి తర్పణలెట్లు చేకుఱున్! 13

14 ఉ॥ ప్రాణము లెట్లొ చిక్కగొని, రాతిరి, పెన్ చలినీటమ్రగ్గి, గ్రా
మాసికి జేరుచుండ, నడుమన్ మృతజీవకళేబరమ్ములన్
పూనికదాటి, అడ్డుపడు, ముళ్ళపొదల్ విదలించు కొంచు యే
రేని, రవంతసాయమిడరే! యని, పల్లియజేరి, కూల${}$బడెన్.

15 సీ॥ సతి వివస్త్రగ, ముళ్ళ సందున, బడియుండ
కప్పి, పైబట్ట, యొకండు వెడలె
తన చంక పసిపిల్ల, పెనుగాలికిన్ దూలి
రాల, తల్లిమనసు, హాయియయ్యో
తలిదండ్రి వెల్లువ గలియ అమ్మా! యని
తపియించు సుతుని, యోదార్ప నెవరు
భర్త పిల్లలతోడ పడిపోవ నీటిలో
'దేవుడా' యంచు, వాపోవు నొకతె
ఇట్లు, కాళరాత్రి, యిల్లిల్లు, శూన్యమై
కానరాడొకండు, కలసి నీట,
ఇట్టి ప్రళయకాల, మేనాడు గంటిమే
వింటిమయ్య! ఎట్టి విడ్డురమ్ము!

16 ఉ॥ తల్లికి పిల్లలేదు, మఱి, తండ్రికి, పుత్రుడు లేడు, పిల్లకున్
తల్లియు లేదుగా, యెవరిదారిని వారలు పల్కరింపకే
వెల్లువలన్ కుటుంబములు, వెన్కయుముందు తలంపు, రాకమున్
చల్లగ జారిపోయిరి, అశక్యముగా విధి దాట నేరికిన్!

17 సీ॥ 'మా తల్లిదండ్రిని, మారెమ్మ పొట్టను
బెట్టుకొనె. నటంచు తిట్టునొకడు
'తన్ననాథ జేసె దైవమ్మ' టంచు తాన్
తలబాదుకొనియె, ముత్తైదువొకతె

‘ఏను బ్రతుక లాభమేమిరా ! సుతుని మ్రిం
గితి’ నంచు, వాపోవు, పితయొకండు
‘ఒంటిజేసి, కాలము గంటిడె, దైవమ్ము
తనువెట్లు మను’ నను, తండ్రి యొకడు.
కుంటివాడు, దైవమునకు కూడ, గిట్ట
డే ! యనుచు నేడ్చు, అంగవిహీను డొకడు.
ఇట్టు లొక్కొక్కరి స్థితి, నెఱుగబల్క
వనట గుందిరి, వారి జేరిన జనమ్ము.

ఉ॥ ఏకడ జూడ గన్పడెె, సహింపని బాధల గొట్టుకొంచు, పె
ల్లాకలిబాధ బెగ్గిలు, జనాళికి, గంజియు, కప్పబట్టయున్
కోకలొసంగి, వారల మనోరథముల్ గ్రహియించి, ధైర్యమున్
జేకుఱు, మంచి మాటలు, వచింపగ, ధీరులు, నేడు కావలెన్. 18

ఉ॥ చిందర వందరై, పడిన జీవుల కన్గొనబోయి, వారి, యా
క్రందన ఘోష, నట్టె, వినగా, భరియింపగ లేక, నిల్చి, ము
న్మందుగ, కాఫి, వారికిడి, ముట్టి కరమ్మున వారి దేహముల్
త్రొందర జేసి ప్రాణములతో యిలు జేర్పగ వచ్చిరెందఱో. 19

ఉ॥ త్రావగ, మంచి నీరెచట, లభ్యముకాదు, తటాక వీరముల్
బావుల నీర ముప్పనయె, పంటలు నీటమునుంగ, నిల్వ నే
సావిడి, యింతపాక, పశుసంతతి మేయగమేత, లేక, వా
పోవుస్థితిన్ గనన్ మది, చివుక్కుమనున్, మన నేది దారియో ! 20

ఉ॥ అప్పుడె పంట సిద్ధమయి, ఆవల నూర్పగనున్న ధాన్యపున్
కుప్పలు, మూలమట్టముగ, గొట్టుకపోవ, ప్రవాహధాటికిన్
ఉప్పెన కోతలో బ్రతికియున్న, అనాథుల, తిండి తిప్పలున్
కప్పుకొనంగ బట్ట, గతిగాంచి, యెవారలు ఆదరింపగన్ ! 21

22 క॥ ఏ కార్తాంతికు డేనిన్
ఈ కలి విధ్వంసనము, వచింపడయో! మా
యీ కర్మ మిట్టులుండగ
వాకొనలే, రెవరటంచు, వాపోవు మదిన్!

23 క॥ ఏ యాపద కలుగన్, నీ
వే! యరికట్టంగదగిన, వేల్పువటే! నే
డీ యాపద నడ్డుపడవు
న్యాయమె! యిటు లూరకుంటివా! లంకమ్మా!

(యిటులూరకుంట! నాంచారమ్మా!)

24 ఉ॥ వేలకొలంది జీవుల, నివేశములన్ గల పాడిపంటలన్
చేలను, పొట్టబెట్టుకొనె, సింధుసమీరుడి కిట్టి దుస్థితిన్
లీలగ( జూడపాడియె! చలింపవె! హంసలదీవి వేణు గొ
పాల నృపాల! ఆపదల బాప సమర్థు(డ, వేమి చెప్పుదున్!

25 ఉ॥ ఏల! ఉపేక్ష జేసితొ! జనించెనుగా, బడబాగ్ని! నీదు, దే
వాలయవాటి కావల, వియత్తలమంటిన, వీచికాతతిన్
కూలగజేసి, సర్వము, వినోదమె! హంసలదివి వేణు గో
పాల! కృపాసముద్రుడవె! పాపము పండినదయ్య! చెప్పుమా!

26 ఉ॥ భూసుర కోటి దేవతల, పొల్పగు దీవనలెందుబోయె! రా
కాసి, తుపాను వాతబడగా, మము గాచెడి వాడెవండు! మా
చేసిన పాతకమ్మేది! యిసీ! యిటులందరి నొక్క పెట్టునన్
గాసిల ప్రాణముల్ గొనెడి కర్మ, మదెక్కడిదయ్య! చెప్పుమా!

సీ॥ ప్రజల కన్నీటి ధారలు, పొంగి ముంచెత్తు
జలధి తరంగాల జారిపోయె
ప్రాణావసానకా లాక్రందనపు ఘోష
కడలి ఘోరార్భటిన్ గలసిపోయె
భీతిమై విడిచెడి, వేడి నిట్టూరుపు
పెనుగాలిలోన, స్తంభించిపోయె
తుది క్షణమ్ము వరకు, పొదలు చైతన్యమ్ము
కాలానల జ్యోతి గలసిపోయె
ప్రభవమంది, పెరిగి, ప్రారబ్ధకాయుండు
పంచభూతముల, లయించిపోయె
చెప్పదరమె! మాయ జీవరహస్యమ్ము
చిత్రమైన, బహు విచిత్రమిద్ది! 27

మ॥ నవకాళీ ప్రళయోగ్రదారుణ దురంతమ్ముల్ వినన్ బల్కగా
ద్రవియించున్ హృదయమ్ము, భారత చరిత్రన్ నిల్చె, మున్ నేడహో!
దివియున్, బందరు సీమ, సర్వము, మహార్తిన్ ముంచె నేడాజలా
ర్ణవ సంక్షోభము, భారతావని చరిత్రన్, మాయబోదెన్నడున్. 28

# మాలిక

29 క్రమముగా పండుటాకులు, రాలు టరుదె !
జగతి కంపించు, ప్రళయ ఝంఝానిలమ్ము
ఫెళ్లనన్, ఫొటకరించు, బిగుళ్ళఁ గూడ
రాల్చుచుండెనె! కాలచక్రం బదేమొ!
ప్రళయనష్టముగూర్చి, తుపానుబాధ
పరిమితము కాదు, దివిసీమ, ప్రాంతమునకు
వనట గూరిచి, బందరు, పల్లె పల్లె
లూడ్చుకొనిపోయె, మొదలంట, ఉప్పెనకును
చెప్పుకొనగ, నాలించు, ప్రసిద్ధ పురుషు
లంతగా లేరుగాన, యీవంత లంత
లంతగా, వ్యాప్తిజెందక, నణిగియుండె.
చెప్పశక్యమె! గుంటూరు సీమగోడు
పంట మొదలంట, నాశమై, బ్రతుకు, తెఱవు
కొఱకు, యిక్కట్లు పడువారు, కోలుకొనుట
లెన్నడో! దైవవంచనకేమి చెప్ప!

ద్విపద : ఇది నూట పదమూడుయేండ్ల, దీగాథ
మించి బాధించిన, మృత్యువు వేధ
ప్రళయ నిశీథిలో పరతెంచినట్టి
బందరు ఉప్పెన, పల్కు భారతము
బ్రమందిరి వేలకొలందిగా జనము

మరి, దివిసీమ, బందరు సీమ జుట్టి
సర్వశూన్యముజేసి, చని, కాళియగుచు
బందరు దివిసీమ ప్రాంతంబదెల్ల
ముంచి ఘోరముగ, హరించె సర్వమ్ము
ఉప్పెన మరునాటి, తిప్పలేమందు !
త్రావ నీరెటలేదు, తలదాచు కొనగ
కొంపలేదు, తినగ - కూడు లేదింత
ఆలించి వారల, ఆక్రందనమ్ము
దేవుడే, విని, దిగిరావలె, బ్రోవ
అపదాబ్ధిపరీవృ తావనిగడ్డ
నడి సంద్రమైనట్టి, నాగాయలంక
కొనయూపిరిన్ గొట్టుకొన్న, కోడూరు
అపద మున్గిన, హంసలదీవి
దిక్కుగానని, భావదేవరపల్లి
పల్లె పట్నము నాక, ప్రాంతంబదెల్ల
వెల్లువలో మున్గి, అల్లాడు చుండె
చేయూత నిచ్చి, రక్షింప, మాపాలి
దేవుండు కలడె ! హా ! దిక్కేది మాకు
అనువారి ఘోషల నాలించి, కావ
కలరె ! ఆపన్నరక్షకులని, తూల

కలడు కలడను వాక్యము రూఢిపరుప
మున్ గజేంద్రుని, హరి, బ్రోచిన యట్లు
ప్రవహించె, సర్వమానవ సహాయమ్ము
మానక, వెన, మంత్రి, మండలి ఘనుడు

3)

దీక్షబట్టగ, నూర్ధ్వ దేవతల్ గూడ
దిగివచ్చి రూప్యముల్, తెగ గ్రుమ్మరించి
దీనబాంధవులైరి, దేవతల్లాగ
వ్రాలె, విమానాల, భారతంబంత
దిన దినమ్ము కురిసె కనక వర్షమ్ము
వస్తు నంభారముల్ వరుస నిండినవి
తోడ్తోడ గూడె, దుస్తులు, దుప్పటులును
సిద్ధాన్న మొనగి, పోషించి రందఱిని.
సాగె నహృదయుల సాయమంతటను
కొంపల నిర్మించి, కూపముల్ త్రవ్వి
పాకల నిర్మించి, బాటలమర్చి
ఉత్సాహమిచ్చి, చేయూత లమర్చి
మఱల, హాయి బ్రతుక, మార్గమ్ము జూపి
సేవజేయు మహానుభావు, లవ్వారిఁ
బ్రోవ విచ్చేసిన దేవతల్ గారె !

సాయమ్ము గొనువారి, స్వాంతముల్, వేరు
సూటిగా, కొనలేని, సూక్ష్మప్రవృత్తి
కలవారి, మర్యాదగలవారి నొకట
కలయంత, కనిపెట్టవలె, జాగ్రతగను
అందఱు, ఒక గాడి మందకాదయ్య
వేర్వేర జనుల, ప్రవృత్తిఁ దెల్పెదను
సామాన్య జనుడు, చేఁ జాచఁ డెన్నండు
అభిమానధనుడు, ఏ యాపత్తు, రాని
తండులములు, గృహాన నిండు కొన్నపుడు

పస్తుండు, జార, డే పట్టున సుంత
మర్యాద బ్రతికిన, మానిసి యొకడు
మేనిపై వస్త్రమ్ము లేనట్టివాని
మన, 'మండలి' గ్రహించి, మర్యాదతోడ
పై బట్ట నొసగి, కాపాడె మానమ్ము.

పదుగురు మేల్గోరు, పంట రైతొకడు
ప్రళయ తుపానున, పంట గోల్పోయి
తిన తిండిలేని, దుస్థితి నతండెట్లు
అభిమానమున్ వీడి, యాచింపగలడు!
మనను విప్పి, ఉచిత మర్యాదతోడ
దరిసి యాతని బాధ లెరిగి సాయమ్ము
చేయుట పాడి, దీక్షాయుతులంత.

స్వీయగాథ వినుడు, వివరింతు, కొంత
ఆనాటి పగలె, ఝంఝానిలధాటి
పొంగి, తరంగ సముద్రుండు, పొరలి
వడిఁ జేరె మా యింటి గడపల దాక
కూలె పెణ్ణెమ్ములు, గోడలాదిగను
ప్రాణముల్ దక్కె మా పశుల కా రాత్రి
ఎటు పునర్నిర్మాణ మేనాటి కగునొ!
ఇట్టి దందరి కథ- ఇంటింట గోడు
విప్పి చెప్పగరాద, ఉప్పెన బాధ.

దివిసీమ పేరందె, దివ్యసీమగను
దేవతా నిలయ సందీప్తి వెలుంగ
బహు యశోవిభావులౌ, మహనీయ కోటి

జనన మందిన సీమ ఘన దివ్యసీమ
ధర, దివిసీమ, సుందర దివ్యసీమఁ
జేయ, ప్రణాళికల్, సిద్ధమ్ము జేసి
ఆరంభమున్ జేసి, యూరట బల్క
దౌర్భాగ్య కాలమ్ము దాపురించింది
పొట్టబెట్టుక మ్రింగె, నిట్టె, తుపాను
ఆదిలో దీనికి హంసపాదాయె
ఆ మాత్రమున దిగు, లందగావలదు
పురుష యత్నమున, జేకుఱుగ సర్వమ్ము
సంకల్ప బలమిక సాగునుగాక
దివిసీమ మిగుల వృద్ధిని జెంది, దినము,
దివ్య సీమగను, వర్ధిల్లుగాక ! ముందు.

భారతమ్ము, జనని, భారతీయుడను
ఆంధ్రమాత సుతుడ - ఆంధ్రుండ నేను
సర్వమానవులు, వాస్తవ సహోదరులు
సౌఖ్యసంపద మనుత సకల జనమ్ము
వాసుదేవ స్వరూపమ్ము సర్వమ్ము
ఆత్మ రక్షణయె, నా యాదర్శమెందు
విన్ని నా పొట్టకు జీవింపగాదు
రామలింగడుగ నే, బ్రతుక వాంఛింప
తీర్చిన నరరూప దేవతల్ వీరు
కష్ట సుఖాల నొక్కరముగా, మనము
పరుపచ్చకై సాయపడు జాతి మనది
వర సంఘసేవయే పరమార్థ మంచు

ఘన ధర్మసూత్ర దీక్షాబద్ధులగుచు
పల్లె పల్లెల ప్రజల్ - పిల్లలు కూడ
పట్టణ పట్టణ పౌరజనమ్ము
మండలి మండలి మహనీయ కోటి
రాష్ట్ర రాష్ట్రాల గౌరవ పూజ్య బుధులు
ఖండ ఖండాల, ఉద్దండ ధార్మికులు
ఆర్త రక్షణయె, మేలైన ధర్మమ్ము
లను సూక్తి తలదాల్చి, అనవరతమ్ము
కదిసి దీన జనాళి హృదయముల్ పొంగ
శక్తికి మించి, యాసక్తియున్ పెంచి
చేయుచున్నారెంతొ, సాయమ్ము వీరు
ద్రవ్య రూపముగ, వస్త్రముల రూపముగ
ధాన్యమ్ము, సరియౌషధములిచ్చి, మిగుల
కాయకష్టమొనంగి, హాయిమనంగ
సేవజేసేడి, త్యాగశీలురన్ గంటె !

స్థానీయులే గాక, తదితర ప్రజలు
విత్తవంతులెగాక, పేద జనమ్ము
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సాంద్ర జనమ్ము
మంత్రి సామంత, సామాన్య జనమ్ము
వారు వీరనకయే - భారతంబంత
ఎడతెరిపి గనక, యీనాటి వరకు
గుప్పించుచున్నారు - కొల్లగా ధనము
బందరు, దివిసీమ, బాధితులకును

ఆలస్యమీక, రాజ్యాంగమ్ము, వేయ
దగు సహాయంబిచ్చి ధన్యతన్ జెందె.

కలసి యందఱు మిల కష్టసుఖాల
అండ దండగ మనముండుటే విధిగ!
కులమతమ్ములు, ఆపదల దూరవెందు
మానవసేవయే మాధవసేవ
కలధనమ్ము శక్తి, కాయకష్టమ్ము
లందించుటే, పరమార్థంబు ధరణి
శాశ్వత సుఖము, ఈశ్వరుడిచ్చి, మెచ్చు
శాశ్వత యశము, విశ్రాంతి, నందించు
ఆనందమిచ్చు, పూర్ణాయువులిచ్చు -
కలవాక్కులీ మహత్కార్యమ్ములందు
వినియోగమౌట, కవిత్వ సార్థకము
బాధితులకును, సాంత్వనవచనాల
ధైర్యమొసగి, తొంటిదారి మళ్ళించి
హాయిమనంగ, శుభాశీస్సు లొసఁగ
పల్కించు, శారదా! వందనమమ్మ!
భారతీజనయిత్రి! వందనమమ్మ!
వినతి, నిస్స్వార్థ సుజనుల కందఱికి
కవి మిత్రులకు శుభాకాంక్షలర్పింతు
మివుల శాంతియగుత కవుల వాక్కులకు
మరల శాంతి, కవుల మంచి వాక్కులకు
శాంతి అందఱికి, విశ్రాంతి సర్వత్ర!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

## అనుబంధము - I

# గాలివానలు - వర్షపాతములు - తుఫానులు - ఉప్పెనలు.

# గాలివానలు - వర్షపాతములు - ఉప్పెనలు

దేశారిష్టదాయకమగు, గాలివానలు, తుపానులు, ఉప్పెనలు, భూకంపములు - వరదలు - అగ్ని పర్వతములు - మొదలగునవి, కళకళలాడే ప్రకృతిని, వికృత మొనర్చి సకల జీవగణానికి బాధాకరమై, లయ స్వరూపమై, హరించుట జగద్విదితము. ఇవి ప్రకృతికి, విపరీతముగా ఉద్భవించి, భీభత్స మొనర్చిగాని పోవు. ఇవి గ్రహముల సంయోగ వియోగములవల్ల భూమండలముపై, వాని ప్రభావము సహజముగా గాక, విపరీత పరిణామ హేతువుగా నుద్భవించు నందురు. జీవుల మనఃప్రవృత్తుల ననుసరించి, వాతావరణము కలుషితమైనప్పుడు గుణపాఠము నేర్పవచ్చిన కాలపురుషుడుగా కూడ ద్యోతకమగు నందురు. నిత్యనైమిత్తికకార్య ఫలార్థములు ప్రకృతి స్వరూపమై, సుఖ దుఃఖ హేతువులై - ఒకప్పుడు సుఖ మరీచికలుగా, మరియొకప్పుడు ప్రళయ భీభత్స ప్రభంజనాకారముగా గూడ గోచరించు నందురు. రాజకృత పాపములు ప్రజలపైనను, ప్రజాకృత చర్యల ప్రభావము, రాజ్యాంగము పైనను ప్రతిఫలించుచుండునని చెప్పుదురు. ఏమైనను జీవుల స్వయంకృత సుకృత దుష్కృత పరిణామములుగా కూడ, సాక్షిభూతములై ప్రత్యక్షమగుచుండును. ఆయుర్వేద శాస్త్రకారుడు, శ్రీ చరకమహర్షి, ఒకచోట, మూలికా నిర్వచనమున, యిట్లున్నారు. 'ప్రజా సముదాయములో, వారి వారల జీవితాచరణ వెల్లువల వాతావరణము, కలుషితమైనప్పుడు, అచటి ప్రతి వస్తువు, ప్రాణోజ్జీవన శక్తి వంతములగు మూలికలు గూడ, నిర్వీర్యములై, నిస్సారములై, జీవపోషక ధాతువుల కోల్పోయి నిరుపయోగములగు' నని.

ఈ పెనుతుఫానులు - ఉప్పెనల గురించి, ఇందు ముఖ్యముగ బందరు పట్టణము, శతాబ్దములుగా, అడపదడప వేధించి, హరించిన, కొన్ని ఉప్పెనల పుట్టుపూర్వోత్తర చరిత్రలు, తెలిసినంతవరకు, యిచ్చట నందించుచున్నాను :

మొత్తముమీద, ఆంధ్రప్రదేశ్ తూర్పు సముద్రతీరమును 1679 అక్టోబరునుండి. 1977 నవంబరు 19వ తేదీ వరకు అప్పు డప్పుడు నష్టపరచిన గాలివానలు, వర్షపాతములు. తుఫానులు, ఉప్పెనలు గురించి సమగ్ర చరిత్ర యిందు వ్రాయుచున్నాను.

## లోగడ తుఫానులు

తూర్పు సముద్ర తీరం మాటిమాటికి, తుఫానులకు గురి యగుచునే యున్నది. 1679 నుంచి 1977 వరకు ఆంధ్రప్రదేశ మును తాకిన కొలది తుఫానుల భోగట్టా యీ దిగువ వివరింపబడినది.

### 1) 1679 అక్టోబరు 13వ తేదీ- బందరు ప్రళయ ఉప్పెన

ఫోర్టు సెంటు జార్జి ప్రభుత్వమువారి 5-11-1679 తేదీ లెక్కలవల్ల బయల్పడిన వివరములు. 13-10-1679 తేదీని, మచిలీ పట్టణము, పరిసరప్రదేశముల తాకినది, పెద్దతుఫాను. షుమారు 20 వేలమంది జననష్టం - ప్రళయగాలికి పొంగిన సముద్ర ప్రవాహము నకు పట్టణములో చాలభాగము కొట్టుకొనిపోయినది. డచ్చివారి ఫ్యాక్టరీలో 12 అడుగుల లోతు నీరు నిండినది. వారి గృహాలెన్నియో కొట్టుకొనిపోయినవి. ఇండ్ల కప్పులు లేచిపోగా, అల్లము మొదలగు

వంట సంబారాలు, వస్త్రముల బేళ్ళు, రాత్రి అంతయు నిలచిన ఉప్పు నీటిలో నాని చెడిపోయినవి. 80 వేల పూల వరహాల డచ్చివారి ఆస్తి నష్టమయింది. ఇంగ్లీషువారి ఫ్యాక్టరీలో మోకాటి లోతు నీరు ప్రవహించింది. పడవలు, ఓడలు, యిండ్లకప్పులు బాగా దెబ్బతిన్నవి. వీధులలో చెల్లాచెదరై, దుర్గంధముతో పడియున్న మానవ కళేబరముల స్థితి కొంచ దుర్భరముగా నున్నది.

1789 మద్రాసు ప్రభుత్వ జ్యోతిష గణిత శాస్త్రజ్ఞుడు శ్రీ యం. టాపింగు లెక్కల వివరణవల్ల, సముద్రప్రవాహము నేటి తూర్పు గోదావరి జిల్లా, (1706) కోరింగు (కళింగ) రేవును, చుట్టు ప్రదేశములను తాకగా, విశేష జననష్టము కలిగింది. అసంఖ్యాకమగు వృక్షములు వ్రేళ్ళతో కూలబడినవి. పంట భూములు పాడయినవి. అయితే నాటి సమకాలికులెవరు, యీ విషయమై ప్రస్తావించలేదు.

2) 1752 ఏప్రియల్ 15 తేదీ - విశాఖపట్టణ ప్రాంత తుఫాను.

నాడు విశాఖపట్టణ ప్రాంతమంతయు తుఫాను పాలబడింది. డచ్చివారి కోటలోని భవనాలకు యెక్కువ నష్టం సంభవించింది. రెండు దినముల తరువాత, విశాఖపట్టణ కౌన్సిల్ అధిపతి, చెన్నపురి, ఫోర్టు సెంటు జార్జి కోట, కౌన్సిలుకు, గవర్నరుకు వ్రాసిన దానికి సమాధానములో 'గ్రామస్థుల పునరావాస నిర్మాణములో, వారి గృహములను, రేవుకు, సాధ్యమైనంత దూరముగా నిర్మించుకొన ప్రోత్సాహమొసగుచు, ఆ నిర్మాణములో, మరమ్మతులలో, తగు సలహా సహాయ సంపత్తు లొసంగ గల, ఒక సమర్థుని పంపించి, అచటి ఆర్థిక పరిస్థితుల ననుసరించి, తగు ధన సహాయము కోరుడని, తెలియజేసెను.

## 3) 1779- ఉప్పెన.

1864 సంవత్సరము, ప్రళయ ఉప్పెనకు పూర్వము 1779 సం॥లో ఉప్పెన, ప్రళయతాండవముజేసి, సమస్తము హరించినది. నాడు బందరులో 80వేల పూల వరహాలతో నిర్మించిన, డచ్చి వర్తక శాలల సామగ్రి యంతయు 12 అడుగుల యెత్తున ప్రవహించిన, సముద్రపు నీటిచే నాశనమైనవి. ఇంగ్లీషువారి వర్తకశాలలలోని మిరియములు, సుగంధ ద్రవ్యములు, మొదలగు సామాగ్రి యంతయు నాశనమైనవి. ఇండ్ల పైని పెంకులు, పెనుతుఫాను గాలికి యెగిరిపోయినవి. మచిలీ పట్టణం నందేగాక, చుట్టుప్రక్కల గ్రామ జనాళితో సహా, సముద్ర తరంగాలలో, షుమారు 20 వేలమంది మరణించిరి. బందరు జనాభా తిరిగి ప్రాముఖ్యము క్రమముగా సన్నగిల్లెను.

## 4) 1787 మే 20వ తేదీ - తూర్పుగోదావరి జిల్లా.

ఇంజరము ప్రాంతమున చెలరేగిన ప్రళయ తుఫాను, నాడు తూర్పు గోదావరి జిల్లాను తాకిన తుఫాను గురించి, అచటి తాత్కాలిక, (రెసిడెంటు) ఉద్యోగి శ్రీ రోగర్ డార్వెంటు రిపోర్టులో మా చుట్టు ప్రదేశ మంతయు తుఫానుకు కొట్టుకొని పోయింది. మరునాడు మే 21తేదీ ఉదయం వెళ్ళి చూడగా, కోరింగు పట్టణము చుట్టు ప్రక్కల గ్రామములన్నియు, సముద్ర జలప్రవాహమునకు గురియై, పాడువారియున్నవి. ఆ ప్రదేశములో చెల్లా చెదురుగ పడియుండిన, పశుకళేబరములు, కూలిపడిపోయిన వృక్షములు, భీభత్స దృశ్యముగా పొడగట్టినది. సర్వస్వము గోల్పోయి, నిల్వ నీడ, తిన తిండి తిప్పలు, ఆధారములేని బాధితులకు, చెన్నపట్నం నుంచి 500 బస్తాల బియ్యము, కొన్ని కాయగూరలు మొదలగునవి అందించారు. ఫ్యాక్టరీ

లోని జనానికి, ముందు కావలసిన సహాయ సంపత్తిగా, కొంత మధిర సారాయి, టీ, పంచదార, బెల్లము మొదలగునవి సరఫరా చేశారు. భారీ నష్టములకు పాల్పడిన, జమీందారులకు భూమిశిస్తులో, చాల భాగము, ముదరా, మంజూరు చేసి, మినహాయింపులు యిచ్చి, అధికారులు, వసూళ్ళల్లో కొంత సడలించారు.

అచటి తాత్కాలిక స్థానికాధికారి, మే 22వ తేదీని గవర్నరు సర్ అర్చి బాల్డు కాంపుబెల్‌కు, ఫోర్టు సెంటు జార్జి కౌన్సిలుకు పంపిన రిపోర్టులో, నాడు తుఫాను తుడిచి పెట్టిన ఘోరస్థితిని గురించి వ్రాయుచూ, కనీసం జీవితాధారములన్నీ ధ్వంసమై, ధరించుటకు వస్త్రములు కాని, తలదాచుకొనుటకు పాకలు గాని, చలి బాధా నివారణకు దూర కొంపగాని యేదీ లేదు - మా తిప్పలు వ్రాయజాలనంత ఘోరమైనవి. సముద్ర ప్రవాహమున మరణించిన వారి బంధువులు వారిని చూచుటకై పరుగులు పెట్టుచూ, సముద్రము మమ్ములను, ముంచేస్తుందని, మా యింటివైపు బొబ్బలు పెడుతూ పరుగిడు వారిని చూచాను. ఆ వేగంగా పొర్లి వచ్చే సముద్ర ప్రవాహము కండ్లార చూచాను. సముద్ర ఘోష విపరీతము. వెంటనే, మంచి ఉన్నత స్థలమున కట్టిన పాత ఫ్యాక్టరీలో తలదాచుకొన్నాను. అందుచే ప్రవాహ వేగమునకు కొట్టుకొని పోకుండా నిలచాను. నాటి సముద్రపు పొంగు 15 అడుగుల యెత్తువరకు లేచింది.

## 5) 1789- డిసెంబరు ఉప్పెన (తూర్పు గోదావరి జిల్లా)

నాటి ఉప్పెన కోరింగు పట్టణాన్ని పూర్తిగా తుడిచివేసింది. మద్రాసు రాజధాని పరిపాలనా, మాన్యూల్ లెక్క ప్రకారము 20 వేల మంది జననష్టము. గోదావరీ నదీ ముఖద్వారము వద్ద పడవలు దెబ్బతిని 'యానాం' పరిసరములవరకు కొట్టుకొని పోయినవి.

శ్రీకాకుళం చుట్టుప్రక్కల ప్రదేశమంతయు తుఫాను భీభత్సము నకు గురియైనది. 1795 అక్టోబరు 11వ తేదీ వెల్లువలో వెయ్యిమంది జననష్టము. మద్రాసు రెవెన్యూ బోర్డు శ్రీ మైకేల్ కోస్టింగు వ్రాతలలో, శ్రీకాకుళము పట్టణము, చిందరవందరగా ధ్వంసమైనది. అచట పట్టణ వాసులలో ప్రాణాలతో బ్రతికిన వారొక్కరైన లేరు. ఒక దాని కొకటి అంటియున్న, నేతగాండ్ర గ్రామాలలో సర్వము నేలమట్టమైనది - పైకి బావుల స్వరూపము మాత్రము కానవస్తుంది. అట్టి ప్రదేశం చుట్టూ, 8 మైళ్ళు తిరిగి చూచివచ్చాను. చెల్లాచెదరై ధ్వంసమైన ఘోరదృశ్యము కాననయింది—

6) చెప్పరాని ఘోరవినాశ స్థితి - 1800 అక్టోబరు 28 తేదీ తుఫాను.

నేటి భీభత్స స్వరూపమగు తుఫాను గుంటూరు జిల్లాను తాకింది. విశేషనష్టము కలిగింది. నవంబరు 7వ తేదీని చెన్నపురి రెవిన్యూ బోర్డు మెంబర్లకు, అధ్యక్షునకు, జిల్లా కలెక్టరు శ్రీ ఆండ్రూస్ స్కాట్ పంపిన రిపోర్టులో, సముద్ర తీరమందలి గ్రామములన్నియు, కొట్టుకొనిపోయి, విశేష జననష్టము కలిగింది. చినగంజాం కంపెనీ వారి, రాకపోకల నున్న పడవ లన్నియు ధ్వంసమైనవి.

నవంబరు 1వ తేదీని, చినగంజాం, ఉప్పు కొఠారు పేష్కారు శ్రీ పయాలి బాపిరాజు, కలెక్టరుకు పంపిన రిపోర్టులో, 'అసంఖ్యాక జననష్టము జరిగింది. ఇటీవల మీ దర్శనానంతరము, మీ ఉత్తర్వు ప్రకారము, యీ తావుననే ఉన్నాను. సిపాయి, కొఠారి నాయకుడు, మా మేనల్లుడు, నేను, ఆ సముద్ర ప్రవాహములో మునిగి బైట పడినాము.దగ్గర గల ఉన్నత ప్రదేశమునగల దేవాలయములో తల దాచుకొన్నాము. పొంగి వచ్చిన నీరు అట్లానే తీసింది.'

## 7) 1832 మే 10వతేదీ (గోదావరి జిల్లా ప్రళయ తుఫాను.)

నాటి తుఫాను తూర్పుగోదావరి జిల్లాను తాకింది. 14వ తేదీని, రివెన్యూ బోర్డుకు, రాజమండ్రి కలెక్టరు శ్రీ ఏ. క్రౌలీ వ్రాసిన ఉత్తరములో కోరింగు సమీపమున, సముద్రము పొంగి, కష్టమ్సు హౌస్ తలుపుల యెత్తునకు అలలు లేచి, తలుపులు బద్దలు కొట్టినవి. లోని రికార్డులన్నియు ధ్వంసమైనవి. చెట్లుచేమలు, పశువులు దెబ్బతిన్నవి. అసంఖ్యాకమగు పశునష్టము, వివస్త్రులైన మృత కళేబరముల గురించి రిపోర్టులు చేశారు. సముద్రతీరము మిక్కిలి లోతట్టుగానుంటచే, తీరప్రాంతగ్రామముల నష్టము విశేషము. కోరింగు పరిసర గ్రామాలు పూర్తిగా పాడయిపోయినవి.

## 8) 1839-తుఫాను (తూ. గో. జిల్లా-కోరింగు)

కోరింగు అడపాదడపా యెప్పుడూ తుఫాను తాకిడికి గురియగు చున్నది. 1839 తుఫానుకు 30 వేలమంది జననష్టము. నాటి, ఒక ప్రేక్షకుని కథనము 'వంద, రెండువందల టన్నుల, అసంఖ్యాకమగు పడవలు దూరప్రాంతమునకు కొట్టుకొనిపోయినవి. అవి తలక్రిందై, ఒకదానినొకటి ఢీకొనినట్లు, గుట్టలు గుట్టలుగా పడియున్న, చిందర వందర స్థితిగాంచిన, అయ్యది క్రూర రాక్షసగణము - చేతలుగా పొడ గట్టును.'

## 9) 1864 నవంబరు 11వ తేదీ మంగళవారము అర్ధరాత్రి బందరు-ప్రళయ ఉప్పెన.

చరిత్ర యింతవరకు కని, విని, యెరుగని, అతి ఘోరము భయంకరమగు ప్రళయ ఉప్పెన 1864 నవంబరు 1వ తేదీని

మచిలీపట్టణమును పూర్తిగా ముంచెత్తి ధ్వంసము చేసెను. సముద్ర అలలు 13 అడుగుల యెత్తున లేచినవి. సముద్ర ప్రవాహము తీరము పొడవున 80 మైళ్ళవరకును బైటి ప్రదేశముపై 17 మైళ్ళవరకు వ్యాప్తిచెందింది. 30వేలమంది జననష్టమూ, అసంఖ్యాక పశునష్టము. రోడ్లు. భవనములు, చెట్లు పూర్తిగా ధ్వంసమైనవి. మచిలీపట్టణం మహా దురదృష్ట స్థితి పాలాయెను. పైకారణములచే జిల్లా కేంద్ర స్థానము మరియొక తావునకు, మార్చవలెనని, యోచన కలిగింది. కాని, అయ్యది ఆచరణలోనికి రాలేదు - అయినప్పటికి, ప్రళయానంతరము, మచిలీపట్టణ స్థానిక సైన్య పటాలాలను, సేనా నివాసస్థలాలను బయటికి తరలించిరి.

బందరు రెవిన్యూ సెటిల్‌మెంటు అసిస్టెంటు ఆఫీసరు శ్రీ జె. లక్ష్మీకాంతారావుగారు, రెవిన్యూ సెటిల్‌మెంటు శాఖ డైరక్టరు శ్రీ అల్. ఇమాన్టరు గార్కి వ్రాసిన 1864 నవంబరు 4వ తేది రిపోర్టులో 'నాటి రాత్రి గం. 9-00లకు, అకస్మాత్తుగా చెలరేగిన ఉప్పెన, పట్టణమును పూర్తిగా తుడిచిపెట్టింది. అచ్చటచ్చట గట్టిగా కట్టబడిన భవనాలు, యేవో కొన్ని మినహాగా, దాదాపు ఇండ్లన్నియు నేలమట్టమైనవి. వేలకొలది జనము, పశునష్టము దాదాపు ప్రభోద్యోగు లందరికి, యీ దురవస్థ తప్పలేదు, అందులో మా స్థితి ముందు చెప్పవలె. 'తంతి తపాలా పరికరములు పాడయి పోవుటచే, టెలి గ్రాములు పంప వీలైనది కాదు, లండన్ చర్చి మిషనరీ సమాచార శాఖకు, మచిలీపట్టణ మిషనరీ శ్రీ షార్కే వ్రాసినది. 'నవంబరు 1వ తేదీ, జీవితములో మరపురాని దినముగా వ్రాసినాడు - నాటి రాత్రి గం. 10-00 నుండి గాలి ప్రారంభమై ప్రళయ గాలిగా మారింది. తలుపులు, కిటికీలు మూసి, తట్టుకొనే ప్రయత్నము చేసితిమి. సముద్ర

ఘోష వినగానే, హతాశులయినాము మేము తలదాచుకొన్న గదికి, వంటశాల నౌకర్లు, శ్రమపడి మమ్ములను చేరగలిగిరి. మరుక్షణములో, సముద్రప్రవాహము, యింట్లోకి ప్రవేశించింది. అప్పుడే మా పిల్లలను, ఒక పెద్దమంచముమీద యెక్కించి, గాలి తట్టుకొనుటకు, ఒక తలుపు దగ్గర కాపలాగా నేనుండవలసి వచ్చింది. ఇంతలో తలుపు గడియలు తలుపులరేకులు ఊడిపడినవి, మమ్ములను చుట్టినగాలికి, సముద్రపు కెరటాల బారినుండి తప్పుకొనుట యెట్టులనే ఆలోచనలో మునిగితిమి. మా పిల్లలు ధైర్యము చిక్కబట్టియున్నారు. అంతట యేర్పడిన ప్రశాంత స్థితి మా దైవప్రార్థన కనుకూలము కాగా, ఓం శాంతిః శాంతిః అని చెప్పిన భగవానునకు అర్పణమైతిమి. వేగముగా పొంగి పొరలు సముద్రపు పొంగు, తటాలున తీసింది. అప్పటికి నేను బొడ్డులోతు నీళ్ళలో ఉన్నాను - ఎంత వేగముగా తరలివచ్చిందో ప్రవాహము అంత వేగముగా పొంగు చప్పున తీసింది. రాత్రి అంతయు అంధ కారము. తెల్లవారకడ గం. 3-00ల తరువాత వెలుతురు కానరాలేదు, ఒకదాని మించి మరియొక విషయము చెప్పవలె - సముద్రపు పొంగు, తీయుట మొదలిడిన తదాది కృతజ్ఞతా భావము; ప్రథమ భానోదయము దర్శింపగలిగినామనే సంతోషపూర్వకమగు సందడులు.

నాడు జిల్లా కలెక్టరు శ్రీ జి. థారన్‌హిల్, జిల్లా పోలీసు సూప రింటెండెంటు పి. టి. సిమ్సు; రెవిన్యూ బోర్డు శక్రటరీ శ్రీ డబ్లియూ హడ్లెసన్ గార్కి 1864 నవంబరు 10వ తేదీని, పంపిన రిపోర్టులో నాడు వీచిన ప్రళయ తుఫాను గాలివల్ల కలిగిన నష్టమింత యని చెప్పనలవికాదు - దానికి మించి సర్వము ముంచెత్తిన సముద్ర ప్రవాహము గురించి చెప్పుటకు, మాటలు చాలవు - పట్టణములో దాదాపు నాల్గవవంతు జననష్టము. మొత్తంమీద ముప్పాతిక

పాలు ఆస్తి నష్టమనిన అతిశయోక్తి కానేరదు. ఆఫీసుల ప్రత్యేక నష్టము గురించి వ్రాయుచూ ! వాటి సముద్రపు పొంగు స్వరూపమది. వరండాల ప్రక్కబడియున్న దున్నపోతుల మృత కళే బరములను, బయటికి తొలగించవలె - కొన్ని రోజులవరకు ఆ విషయము పట్టించుకొన్నవారే లేరు - ఇప్పుడు కూడ వందలాది, మానవ కళేబరములు, నేలపై చిందరవందరగా పడియున్నవి - దీన్ని మించిన ప్రారబ్ధబాధ ఇంకొకటి యున్నది. ఆ బాధల యందు మిగతా జనానికి త్రాగే నీటి విషయమైన ప్రశ్న - కొన్నాళ్ళవరకు ఆ ప్రాంత మున త్రాగేనీరు గల ఒక బావి యుండేది. నా దొడ్లో 4 శవాలను, దాదాపు 50 జంతు మృత కళేబరములను పూడ్చిపెట్టితిమి. ప్రక్క దొడ్లలో 20 వరకు పూడ్చ బడినని. వివిధ తాలూకాలలో జమీందారీ ఈనాందార్లకు, నందిగామ, బందరు, చల్లపల్లి, బెజవాడ, రేపల్లె, బాపట్ల, కృత్తివెన్ను, దేవరకోట మొదలగు తావుల, సంభ వించిన నష్టముల గురించి లెక్కలిచ్చిరి - బెజవాడలో 30మంది జన నష్టము - దేవరకోట పరగణా ఘంటసాలకు కలిగిన నష్టము గురించి లెక్కలిచ్చారు. అక్కడ పడియున్న శవము లెవరెవరివో గుర్తుపట్టలేక యున్నవి. ఉప్పెనకు కొట్టుకొని వచ్చిన మృత కళేబరములు, ఘంట సాల పరిసర గ్రామములచుట్టు పడియున్నవి - అనేక యిండ్లు సామా నులు ప్రవాహమునకు కొట్టుకొనిపోయినవి. వాటికై దొంగలు యెగ పడినారు. మచిలీపట్టణ మిషనరీ వ్రాసిన ప్రతి రిపోర్టులో ఉప్పు కొఠారులకు కలిగిన నష్టము గురించి వ్రాసినారు. బంటుమిల్లిలో 2,40,000 మణుగల ఉప్పు కొట్టుకొని పోయినది-మంగినపూడిలో యేమాత్రము ఉప్పు మిగిలింది లేదు-నిజాంపట్నం, చిన గంజాం స్థితి కూడ అంతియే - పరిసర ప్రాంతములగు నెల్లూరు, గోదావరి జిల్లాల నుంచి తాజా సరుకు తెచ్చి, లోటు పూర్తిచేయు యత్నములు సాగినవి.

నూట పదమూడేండ్ల క్రితము రక్తాక్షి నామ సంవత్సరము దీపావళి పండుగ మూడవనాడు కార్తీకశుద్ధ విదియ మంగళవారము అర్ధరాత్రి (1-11-1864) ఉప్పెన 30 వేలమంది జనాన్ని పొట్టను పెట్టుకొన్నది. హృదయ విదారకమగు ఆ ఉప్పెన కథ యిది - ఆనాడుదయం, వానజల్లులతో గాలి ప్రారంభమై, ఆకాశం దట్టముగా మేఘావృతమై పగలు గం. 2-00 లకు గాలి, వర్షపాతము తీవ్రమై, సాయంత్రం గం.5-00 లకు, ఆకాశం అంధకారబంధురమై, యెదుటి మనిషి కానరానంతగా, చీకటి అలముకొన్నది. రాత్రి గం.11-00 గం.11-30లకు సముద్రపు పోటు ఆరంభమై, గాలి క్రమముగా ఈశాన్య దిశగా మారినది. ఇంతలో వీధులన్నియు జలమయమై ధారా పాత వర్షములో, పెనుగాలి మ్రోతలో, బైటి సాయమపేక్షించు వారి, కేకలగోడు, బైటివారి కేమాత్రము వినబడే అవకాశము లేదు. నీటి ఉరవడికి, కాలు నిలద్రొక్కుకొనలేక, పైకి ప్రాకే ప్రయత్నము, పెనుగాలి వేగమునకు, వెనుకకు నెట్టి పడవేయు ప్రమాదములో, యేమాత్రమైన పట్టుజిక్కుకొన ప్రయత్నించు జీవికి, నిరాశ, యెదు రగు చుండెను. ఈ లోపల, యిండ్ల తలుపులు, కిటికీలు, గడియలు ఊడి, విరిగి, నీళ్ళ ఉరవడికి కొట్టుకొని పోజొచ్చెను. దూలములు విరిగి మీదపడునేమోయను భయము, యినుమడించినది. ఆ యెడ తెగక, గ్రుమ్మరించు వర్షపాతమునకు బట్టలు తడిసి, యొంటి నంటు కొని పోవ, చలి వణుకుతో శరీరం ముద్దకట్టుకొనబోజొచ్చెను. గంట గంటకు అడుగు యెత్తున పొంగి ప్రవహించే నీటిలో కాలు నిలద్రొక్కు కొనలేక, బైటపడు సాధనములేక, చివరకు పట్టుకొనుట కాధారము లభింపక, మరల గాలికి కొట్టుకొనిపోయే ప్రమాదములో, ప్రాణములు నిలచునన్న ఆశక్తి క్రమముగా సన్నగిల్లెను. అప్పటికది మామూలు పొంగు కాదని, సముద్రపు పొంగని, సర్వులు గ్రహింపగల్గిరి. ఆ

విపత్తు సమయంలో యెందఱో దేవుళ్ళకు, యెన్నో మ్రొక్కులు, యెన్నో మూగవోయిన దైవప్రార్థనలతో, తట్టుముట్టాడు జీవుల బాధ భరింపరానిది. ఇండ్లలోని దీపము లెప్పుడో ఆరిపోయినవి. అంతయు కటిక చీకటి మయము. ఒకరి సంగతి మరియొకరికి చెప్పుకొని సాయ మపేక్షించు అవకాశములేక, యెవరికివారు, తమ తమ ప్రాణరక్షణార్థ సాధనలకై తపన పడుచుండిరి. ఆ అర్ధరాత్రి గం. 12-00, 1-00 ని.ల. మధ్య, పండ్రెండు, పదమూడడుగుల యెత్తునలేచి, ముంచెత్తు తరంగాలలో యెంతమంది నిహతులైనారో ఊహింప శక్యముకాదు. భవంతులు, పాకలు, పశువుల కొట్టములు, చెట్లుచేమలు, సర్వము మూలమట్టముగ కూలిపోయి, జలప్రవాహమున కొట్టుకొని పోవు చుండెను. నీటిప్రవాహమున బడిన జీవులు, యిండ్ల గోడలక్రింద, మట్టి కుప్పల క్రింద కూరుకొనిపోయిన మృత కళేబరములకు, లెక్క లేదు. ఆ ప్రవాహ వేగమునకు ఆస్తిపాస్తులును, జంతు జాలములున్నూ నాశనమైనవి. ఆ అర్ధరాత్రి ఉప్పెన రాకాసి, 30 వేలమంది జనులను పొట్టను బెట్టుకొన్నది. అప్పటి బందరు జనాభా 60 వేలలో దాదాపు నాల్గవవంతు జనాభా యీ ఉప్పెన వాతబడినది. అది దీపావళి పండుగ మూడవ రాత్రి - కొడుకులు, కోడండ్రతో, మనుమలు, మనుమరాండ్రతో, విలువగల దుస్తులతో, నగలతో నిద్రించు వారందఱు, ఆ రాత్రి ఉప్పెనకు, ఆహుతులైరి. తెల్లవారుసరికి, మరునాడు, నడుములోతు నీళ్ళలో తడుముకొనుచూ, చేర వచ్చేవారు, రాత్రి - చెట్టుకొమ్మల, ఇంటికప్పుల, దూలములపై, తలదాచుకొని బ్రతికిన ఆ కొలదిమంది, రాత్రి ప్రళయానికి దెబ్బతిన్న శరీరులు- వీరు, నెమ్మదిగా దిగివచ్చి, హతులైన తమ తమ కుటుంబములకై అల్లాడువారి ఆక్రందనపు ఘోష, హృదయ విదారకము. కుప్ప కూలిన యిండ్ల సందుల, గోడల క్రింద, పాకల సందుల పడిన, మృత

కళేబరముల గుర్తుబట్టి పైకి తీయువారు, పునరావాస కార్యక్రమములో బాధితులకు తిండి, వస్త్రములందించి యోదార్చు స్వయం సేవకులు, బంధువులు, మిత్రుల ఆదరణ, స్థానీయులేగాక, బైట గ్రామముల నుంచి, త్వరపడి యేతెంచి సాయమిచ్చువారు, త్రోవ నడ్డుపడిన, మృత కళేబరముల తొలగించి త్రోవజేయు ధైర్య సాహసికులు, యెందఱో మహానుభావులు, కుల, మత, జాతి విచక్షణలేక, ఆపద్ధర్మ ముగా, విడిగా రేబవళ్లు సేవచేసినారు. ప్రభుత్వము, స్థానిక ప్రభుత్వములు, వ్యక్తులు, పెద్దయెత్తున, నిర్వహించిన సహాయ కార్య క్రమములు, ఉవ్వెత్తుగా సాగినవి. కుప్పలు కుప్పలుగా పడిన జన, జంతుజాలముల మృత కళేబరములతో నీరు, మురిగి, వాతావరణము కలుషితమై, వ్యాధులు ప్రబలెను. ఉబ్బసము, చలిజ్వరము, కీళ్ళ నొప్పులు, మొదలగు వ్యాధులచే, మరి కొందఱు మరణించిరి. క్రైస్తవ మిషనరీలు, అనేక స్వచ్ఛంద సేవా సంఘములు, యెడతెరపిలేక, సాయమందించినవి. హంసలదీవి సమీపమున బడబాగ్నికి లేచిన 12 అడుగుల సముద్రపు కెరటాలు, ప్రవాహపు పోటు, నాగాయలంక, బందరు కాలేఖాన్ పేట మీదుగా, తాళ్ళయెత్తున పొంగి బందరు పట్టణమును, పూర్తిగా ముంచెత్తెను. ఆ విపత్సమయమున, చేరువన గల యిండ్లలో, డాబాలలో, తలదాచుకొనుటకు చేరినను, చాలమందికి మరణము తప్పదయ్యెను. బందరు ఖొజ్జిల్లిపేటలో శ్రీ జోగి జగన్నాథ పంతులుగారి మేడ, అప్పటికి, యిప్పటికి, చెక్కుచెదరక నిలచి యున్నది. ఆ మేడపై ఆ రాత్రి వేలకొలది జనం ప్రాణములు దక్కించుకొని బ్రతికిరి. మా పితామహులు ఖొజ్జిల్లిపేటలో యింటి దూలముపై ప్రాణములు దక్కించుకొన్న నాటి, భీభత్స కథనము లోగడ విని, దైవేచ్ఛకు ఆశ్చర్యపడితిమి. ఉయ్యాలలో నిద్రించుబిడ్డ, ఉయ్యాలతో చెట్టుపైకి కొట్టుకొని పోయి బ్రతికిన, ఆ అదృష్టజీవునకు,

సముద్రాల నాయ్డు అని పేరు పెట్టిరి. వీరిని బాలకాలము వరకు చూచిన వారలెందఱో కలరు. చింతకుంట పాలెంలో, పురుషో త్తమ సోమయాజి అనే ఆయన, అలల పొంగు తాటిమొవ్వులో జిక్కి బ్రతికిన యుదంతము కూడ కలదు. బందరు తాలూకా, నందమూరు గ్రామ కరణం శ్రీ నందమూరు కామరాజు పంతులుగారు, నాటి ఉప్పెనలో త్రాటి మొవ్వులో చిక్కుకొని, బ్రతికిన విషయముకూడ యిప్పటికి చెప్పుకొందురు.

మూక ఉమ్మడిగా, మరణించిన ఒకే కుటుంబములో యేక కాలమున, మరణించిన వారికి, యేక కాలమున తద్దినములు పెట్టుటకు భో క్తలు లభ్యముగాక కొన్నేండ్ల వరకు యిబ్బంది పడి నెరవేర్చు కొనేవారు. దానితో ఉప్పెన తద్దినాలు అనే పేరు కూడ వ్యాప్తి చెందింది. ఆనాడు విలువలగల చీరెలు, ఆభరణములతో మృతి జెంది నేలపై పడియున్న, మృతజీవులపై గల, ఆ యాభరణాదులకై, ఆరాటపడు, కపట దుఃఖాభినయ కలాపముతో హరించిన ఘోర కిరాతకులు కూడ లేకపోలేదు. పట్టణస్థితి యిట్లుండ, పట్టణ పరిసర పల్లెలగు, గిలకల దిండి, నాగాయతిప్ప, గరాలదిబ్బ, జాలరుల గతి వేరుగ చెప్పనక్కరలేదు. 700 మంది జనాభాగల శివగంగ (బందరు పట్టణ శివారు) లో 70మంది మాత్రము బ్రతుక గల్గిరి. జననష్టము 30 వేలకు మించి యుండిన, యిక నిల్వ తావులేని, పశు, పక్షి జాలముల మృతుల సంఖ్య అనూహ్యం.

ది 17-9-14 - రాబర్టు యెలిన్ వ్రాత గమనింతము—

'బాటల వృక్షములు పూ ర్తిగా పాడయి, ఇదివరలో మనో హరములైన రాజమార్గములతో, ధన ధాన్య సంపదలతో తులదూగు పట్టణము చూపరులకు, భయకంపితులను జేయుచు, దుఃఖసాగరమున

ముంచెను. మార్గములన్నియు ముండ్లకంచెలతో, రాళ్ళతో కప్ప బడెను'—

మరియొక శిలాశాసనము :

"ఆంటోన్మేరియా స్ఫురాలు - వారి బంధువులు, స్నేహితులు, పట్టణ ప్రజలు మున్నగు 30 వేలమంది మనుష్యులు నవంబరు 1వ తారీఖు రాత్రి అకస్మాత్తుగా, ఉప్పెనచే మరణించినందుకు, దుఃఖము వెలిబుచ్చుటకు, అప్పటి కలెక్టరు 'థారన్ హిల్లు' ప్రజల సౌకర్యార్థమై సల్పిన నిరంతర కృషికి, కృతజ్ఞత చూపుటకు, యీ కట్టడము నిర్మింప బడినది."

## 10) 1879 నవంబరు 19 తేదీ తుఫాను

నాటి తుఫాను, పెద్దహోరుతో కృష్ణాజిల్లాను తాకింది. రేపల్లె, విజయవాడ తాలూకాలలో, అసంఖ్యాకమగు పశువుల, జననష్టము - 29 నవంబరున, కలెక్టరు ప్రభుత్వమునకు వ్రాసిన దాసిలో 'మైళ్ళ కొలది, ప్రదేశమంతయు, సముద్రపు పొంగులో మునిగిపోయింది. అడ్డదిడ్డముగా కాలువ గట్లన్నియు గండ్లు పడినవి. దాదాపు పల్లపు పంట పూర్తిగా నష్టమయింది'—

## 11) 1879 డిసెంబరు 6, 7, 8 తేదీల తుఫాను.

1879 డిసెంబరు 6, 7, 8, తేదీలలో విశాఖపట్నం గోదావరి జిల్లాలు తుఫానుకు గురియైనవి. పొంగిన సముద్ర ప్రవాహమునకు 440 మంది జన నష్టము, 5 వేలవరకు పశు నష్టము 9 వేల యిండ్లు నేలమట్టమైనవి — రోడ్లు, పంట కాలువలు, గండ్లుపడి, పాడయిపోయినవి.

## 12) 1925-5-15 తేదీ చిన్న ఉప్పెన.

నాటి ఉప్పెన, క్షారవాతాహతికి, చెట్లు చేమలు, ఆకులు, అలములు, తుదకు రక్కెన మట్టలు, సైతము భిన్నాభిన్నములై, వాడి పోయినవి. నాటి ప్రళయ గాలికి, బందరు రాబర్టు సన్‌పేట, కుండు చుట్టున గల, భవనములు, కొట్లపై గల, రేకులు, కప్పులు లేచి, ప్రళయ వేగముతో దూరానికి విసరివేయబడినవి. ఇండ్లు, వీధులు, చిందర వందరై, ధ్వంసమైన, కలప, పెంకులు, రాళ్ళతో, గడ్డి కుప్పలతో, చెత్త చెదారములతో, అంతటా ఒక వికట స్వరూపదృశ్యము కానవయ్యెను. సముద్రము పొంగి, సముద్రపు కయ్యలు, కాలువలు దాటి కొబ్బరి తోటల ప్రక్క భూమి, ఒక జలార్ణవమై, 'కరి' మీద, దేవాలయము వరకు వచ్చి, ఆగిపోయినది. నాడు పట్టణము, బయలుమాదిరి. ఆంధ్ర జాతీయ కళాశాలలో, గొడ్లపాకలు, కాపురమున్న పెద్దపాకలు, నేల మట్టముగా పడిపోయినవి. ఆ ప్రళయ గాలికి, ఆవరణమంతట, తాడితోపు అగుటచే, ఫెళ ఫెళ త్రాళ్ళు విరిగి, పెద్ద మ్రోతలతో, భయంకర దృశ్యము కానవయ్యెను. ఈ భయానక స్థితిలో, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పెద్దలు, చాలమంది, ధైర్యమూని, ఒరిగిన గొడ్ల పాకలు, లేవనెత్తి, పశువుల మెడపలువులు కోసి, పశువుల ప్రాణములతో బైటికి పంపగల్గిరి. మొత్తముమీద జన నష్టము గాని, పశు నష్టముగాని అచ్చట జరుగకపోవుట అదృష్టము.

## 13) 1927 నవంబరు 1వ తేదీ (నెల్లూరు తుఫాను)

ఈ శతాబ్దములో 1927 నవంబరు 1వ తేదీని నెల్లూరును తాకినది. భయంకరమగు ప్రళయ తుఫాను - నెల్లూరుకు, ఉత్తర దక్షిణములుగా, 25, 30 మైళ్ళవరకు వ్యాప్తము చెందిన తుఫాను, పట్టణములోని దాదాపు భవనములన్నిటికి నష్టము కూర్చినది - 629

మంది హతులైరి - 50 వేల పశునష్టము - కడపజిల్లాలో కూడ నష్టము సంభవించింది—

14) ది 22-11-1928 - గాలివాన

నాటి గాలివానతో, కురిసిన కుంభవృష్టికి, బందరు పట్టణములోని, పాకలు, పూరిండ్లు, నేల మట్టములైనవి. పేద జనులకు, తల దాచుకొనుటకు, భుక్తికి ఆదరువులేక, యిబ్బందుల పాలయినారు. పట్టణమంతయు జలమయమై, ప్రాణులు కదల మెదలలేని భీభత్స స్థితి యావరించింది. వెంటనే పట్టణ ప్రజలు, న్యాయవాదులు, మ్యునిసిపల్ ఛైర్మన్ శ్రీ కొల్లిపర వెంకట రమణయ్య నాయుడుగారు, డాక్టరు పట్టాభిగారు, మొదలగు పెద్దలు, కొలదిమంది అప్పటి 'భవానీ శంకర్ లాడ్జి'లో సమావేశమై, తుఫాను బాధితులకు, పునరావాస కార్యక్రమముల గురించి చర్చించి, తగు విధానములు జరిపిరి. ఆ సమావేశమునకు, కలెక్టరు, శ్రీ టి. భాస్కరరావు నాయుడుగారి సాను భూతి, సహాయ సంపత్తులతో, ప్రారంభమై, మ్యునిసిపల్, రెవిన్యూ శాఖల వారలు కలసి, కార్యక్రమములు నిర్వహించి పూర్తి చేసిరి. ఆ అదుర్దా సమయములో, కొందఱు పెద్దలరుదెంచి, డా॥ పట్టాభిగారితో 'బాబూ' జిల్లా న్యాయాధికారి (జడ్జీ) ఇంత వర్షములో కూడ, పార్టీలు కోరినప్పటికి కోర్టు మూయక, విచారణ సాగించుచున్నారనే మాట వినీ వినగానే, డాక్టరుగారు 'Such people should be shunted out of the District' ఇటువంటి పెద్ద మనుష్యులను జిల్లా బైటికి, తరిమివేయాలి అన్నారట. నాడు బాధితులకు, యింటింటికి తాటియాకు, వాసములు, సప్లయిలతో పాటు, సగటున, తలకు రెండు రూపాయలు చొప్పున, సానుభూతి ద్రవ్యమొసగి, కార్యక్రమ నిర్వహణకు తోడ్పడిరి. ఈ సమయాన, రాష్ట్రము నలు మూలల నుంచి,

భూరివదాన్యుల నుంచి సేకరించి పంపిన విరాళములు కూడ, సకాల మున వినియోగపడినవి—

## 15) 28-10-1936 - గుంటూరు తుఫాను.

నాటి తుఫాను గుంటూరు జిల్లాను తాకింది - బాపట్ల తాలూకాకు విశేష నష్టము - కలెక్టరుగారి రిపోర్టువలన, 233మంది జననష్టము- 32,746 కుటుంబములు నిరాశ్రయులైరి-పునరావాస పథకములో, కలెక్టరుగారి వ్రాతలలో అచ్చట రెండు రాజకీయ పార్టీలు జోక్యము వలన, నేనెంత బాధపడితినో చెప్పలేకున్నాను — అందలి నియోజక వర్గానికి తామొక్కరే, సేవచేసినట్లు పేరు నిల్పుకోవాలని, ప్రభుత్వము యేమంతగా సేవ చేయలేదనే, విషయము నాకెంతయో బాధ కలి గించింది అయినప్పటికి, చివరకు సహాయ కార్యక్రమములన్నిటిని నిర్వహించింది ప్రభుత్వమొక్కటే!

## 16) 26-10-1949 తేదీ (వర్షపాతముతో కూడిన గాలివాన)

ఇది ఒక చిన్న ఉప్పెనలాంటి గాలితోకూడిన తుఫాను. ఈ తుఫాను తాకిడికి, పట్టణమంతయు అల్లకల్లోలమై ముఖ్యముగా పేద జనులు యిబ్బందుల పాలగుట సహజము. నాడు 100 కిలో మీటరుల వేగముతో గాలి సాగింది. 4 మీటర్ల యెత్తున, 15 కిలో మీటర్లు తీరమునుండి బైట ప్రదేశమునకు వ్యాప్తి చెందినది- మొత్తము నష్టము 800 మంది-10 వేలయకరముల పంట నష్టము. అప్పటి కలెక్టరు, 'పేరు' దొర, నాటి మ్యునిసిపల్ ఛైర్మన్ డా॥ రాళ్ల పల్లి అచ్యుతరామయ్యగారు, మ్యునిసిపల్ అధికారులు, సిబ్బంది కలసి, పునరావాస కార్యక్రమములు, వెనువెంట సాగించిరి, కలెక్టరు, విజయవాడనుంచి, జీపులో వచ్చి, జిల్లా పరిషత్ ప్రక్క,

నీటి ప్రవాహములో కొట్టుకొనిపోవు బాలుని, నిక్కరు డ్రస్సుతోనే, వెంటనే నీళ్ళలో దిగి, కాపాడిన, యుదంతము మరపురానిది. ఇచట ఒక చిత్రమైన విషయము గుర్తుకు వస్తుంది. అచట పోలీసు, మిలిటరీ శాఖలు వారు, తుఫాను బాధితుల సహాయ కార్యక్రమములు, రెవిన్యూ, మ్యునిసిపల్ శాఖల బాధ్యతయే యని, జోక్యము కలిగించు కొనక, దూర దూరముగా ఉండగా; ప్రజలు కడమ శాఖల వారి యొత్తుడుల వల్ల, గత్యంతరములేక, కదలి, స్కౌట్సు, గైడ్సు సహాయముతో కలసి, కార్యక్రమముల తోడ్పడి సేవజేసిరి.

## 17) ది 8-9-1962 - విపరీత గాలివాన.

నాటి తుఫాను బాధితుల సహాయ కార్యక్రమములు అప్పటి మ్యునిసిపల్ కమీషనర్, శ్రీ మీర్జా అన్వర్ బేగ్ గారు, ఛైర్మన్ శ్రీ సన్నాల వేణుగోపాలరావుగారు, తమ సిబ్బందితో, పేద జనానికి భోజన వసతి కల్పించి, పాకల పునర్నిర్మాణ కార్యక్రమములో, తాటియాకు, వాసములు వగైరా సామగ్రి యిచ్చి, యెంతయో సేవ జేశారు.

## 18) ది 5-11-1968 - వర్షపాతము - పెద్దవరద

నాటి కుండపోత వర్షము, వరదగా పొంగి, పారి, బందరు, దివి, గుడివాడ, కైకలూరు తాలూకా గ్రామాలను ముంచెత్తింది. వర్షపాతమునకు తోడు, విపరీత గాలి వీచింది. ఏళ్ళు కోళ్ళు, యేకమై, పొలాలన్నియు, ఒక జలార్ణవముగ వరద ప్రవహించింది. ఈ వరద తాకిడికి, జననష్టము కంటె, పశునష్టము విశేషము. గాలికి పడిపోయిన పాకలు, కూలిపోయిన యిండ్లకు లెక్కలేదు—

## 19) 17-5-1969 వ తేదీ - తుఫాను

ఈనాటి ప్రళయ తుఫాను, ఆంధ్రప్రదేశ్, సముద్రతీర జిల్లాలన్నిటిని తాకింది - భారీ వర్షపాతము. దీనిచే గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరీ జిల్లాలు నష్టపడినవి - గుంటూరు జిల్లా 606 జననష్టము - కృష్ణా జిల్లా దివితాలూకా తీరప్రాంతమందలి 5 గ్రామాలు దెబ్బతిన్నవి ; కృష్ణా తూర్పుగోదావరి జిల్లాల వరిపంట నష్టము 20 కోట్ల రూపాయల మేరకు ఉన్నది - 24వ తేదీ హిందూ పత్రికలో ప్రచురింపబడిన దానిలో, 'గుంటూరు జిల్లా, యానాది సంఘ గ్రామములో, ఒక స్త్రీ తన బిడ్డతో, పూరిపాక పైకప్పుపై, యెక్కి, ప్రవాహమునకు కొట్టుకొని పోకుండా నిల్వగలందులకు, ఒక కొయ్యకు ముడివేసికొనెను-ఇంతలో తన సమీపమున నీటిలో తేలుచున్న పెట్టె కొరకై వెళ్ళిన, భర్తను, ఆ ప్రవాహము గుంజివేసింది'. అని సమాచారము—

## 20) 8-11-1969 వ తేదీ (దీపావళి నాటి ఉప్పెన).

ది 8-11-69 నాటి తుఫాను, చిన్న ఉప్పెన అనవచ్చును. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, కృష్ణా, విశాఖపట్టణం జిల్లాలలోని యెక్కువ ప్రదేశాలకు తాకింది. 10 అడుగుల యెత్తున లేచిన, తుఫాను పొంగు, కొల్లేరు కోట గ్రామాన్ని చుట్టు ముట్టింది. కొల్లేరు సరస్సు సమీపమున 30 అడుగుల నీరు పైకి లేచి, సుడిగుండము తిరిగి, బయటికి చెల్లాచెదరుగా విరజిమ్మ బడింది. దీనివల్ల అంతులేని 250 మంది, జననష్టము. 10 వేల పశునష్టము. 4 లక్షల యిండ్లు నేలమట్టమై, 25 వేల గొఱ్ఱెలు, మేకలు మృతి చెందినవి. 65 కోట్ల విలువగల 18 లక్షల యకరాల పంట నష్టము, అప్పటి జిల్లా

కలెక్టరు, శ్రీ బావలి శ్రీనివాస శాస్త్రిగారు, పెనుగాలికి, త్రోవలోపడిన చెట్ల కొమ్మల తొలగింపు చేసికొని, విజయవాడ నుంచి, జీపులో వచ్చి, తాను, అప్పటి మ్యునిసిపల్ ఛైర్మన్ శ్రీ నన్నాల వేణుగోపాలరావు గారు, స్పెషల్ ఆఫీసరు శ్రీమాన్ నండూరి మంగాచార్యులుగారు మ్యునిసిపల్ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది కలసి, సహాయ కార్య క్రమములు నిర్వహించినారు. కైకలూరు తాలూకా, పెద్దింటమ్మ గుడి వద్ద, ముందు, మంటల వెలుతురు కనుపించినదట, దరిమిలా తాళ్ళ యెత్తున అలలు పొంగిన జలం, సర్వనాశనము చేసింది. తాలూకా అంతయు, ఒకే కొల్లేరుగా మారినది. నందిగామ తాలూకాలో పొలాలు, ఇసుక మేటులు వేయగా, దరిమిలా ప్రభుత్వము, వేల ఖర్చుతో దిబ్బలు తీయించి, పొలములు సాగుకు ఉపయోగపడునట్లు బాగుచేసినది. కైకలూరు తాలూకా తహశ్శీలుదారుగారు శ్రీ కరెడ్ల వెంకటేశ్వర్లుగారు, కలెక్టరు, రెవిన్యూ శాఖవారు, అజమాయిషీ చేయించి, దామాషాగా, ప్రతి వ్యక్తికి, నగటున, రెండు వేల రూపా యలు ధన సహాయముచేసి, ప్రజా గౌరవమును చూరగొన్నారు. ఆ విపత్సమయమున, బందరు మ్యునిసిపల్, రెవిన్యూ శాఖల సిబ్బంది కలసి, మరపురాని, సహాయ కార్యక్రమముల నిర్వహించి నారు. ఇచట ఒక విషయము గుర్తుకు తెచ్చుట సముచిత మనుకొనెద. ప్రతిసారి సాగిన, మ్యునిసిపల్ సహాయ కార్యక్రమములలో అన్నిటి వెనుక, అండదండగా, సలహా సంప్రదింపులతో, అధికార ధర్మము తోనేగాక, ప్రత్యేక శ్రద్ధతో యెనలేని జాతీయ సేవా ధర్మముగా నిర్వహించిన మ్యునిసిపల్ మేనేజరు శ్రీ మండల సత్యనారాయణగారి అకుంఠిత సేవా దీక్ష మరువరానిది - వీరి సిబ్బంది, సేవలకు తోడు సదా సహాయ సంపత్తు లందించు, భూరివదాన్యులగు పురప్రముఖుల అభిమానము, సర్వదా, సకాలమున కందగా, సహాయపడిరి.

## 21) 4-11-1976 వ తేదీ - పెనుతుఫాను.

నాటి తుఫాను, అంత ఉప్పెన వంటిది కాకపోయినను, వారం దినములు ఎడతెరిపి లేక కురిసిన, కుంభపోత వర్షముతో, పంట చేలు, కోతకు సిద్ధమైన సిద్ధాన్నమగు పంట, పూర్తిగా నీటిపాలై, రాలిన గింజలు, మొక్కలు మొలిచినవి కూడ, అక్కడక్కడ రాలి పడిన గింజలను చేతులతో దేవి, సమకూర్చుకొన్న, తడిసి యెండిన ధాన్యమును, ప్రభుత్వము, కొంత కొనుగోలు చేసి, సహాయపడింది. అప్పుచేసి, నారుపోసి, ఊడ్చి, కోతకోసి, పంట తెచ్చుకొని జీవింప నాశగొను, సామాన్యరైతులకు, కూలి జనానికి, బ్రతుకు తెలువు లేక, జీవితములో ఒక నిస్పృహ, నిరాశ, దీనస్థితి ఆవరించింది. మించి, అది ఒక తీరని కరువుగా పరిణమించింది. జీవితమున సుఖపడ, ఊపిరి పీల్చుకొననెంచు, కష్ట జీవులకు, యీ తుఫానుదెబ్బ భరింపరానిది. అది యిప్పుడప్పుడే తీరుననను,ఆశ యేమాత్రము కనుబడుట లేదు. ప్రభుత్వము శిస్తు మినహాయింపుజేసి, మరల క్రొత్త పంటకు కావలసిన, దీర్ఘ కాలిక ఋణాలు, స్వల్పకాలిక ఋణాలు, మంజూరు చేసి, కొంత ధైర్యోత్సాహము లిచ్చి చేయూతయైనది. ఈ తుఫానుకు యెన్నియో, పాకలు, గుడిసెలు నేలమట్టమై కొన్నిచోట్ల నిరాడంబరముగ పాకలలో పాఠశాలలు నిర్వహింపబడుచున్న ఆ పాకలు కూడ, కుర్చీలు, బల్లలు, మొదలగు సామగ్రితో, అంతయు పూర్తిగ విరిగి, నేల మట్టము లైనవి-మామూలుగా స్థానిక సంస్థలు, మ్యునిసిపాలిటీలు, ప్రభుత్వము చేయు సహాయక చర్యలు, యెన్ని యెంతగ సాగినను, యీ నష్టము యీ కొరత, యింతలో తీరునని, చెప్పవలను కాదు. అట్టిది యీ పెను తుఫాను—

ఇచ్చట నాటి తుఫానులో మరపురాని, యొక విషయము

జ్ఞప్తికి దెచ్చుట ముఖ్యము - ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవ సందర్భమున, పర్యటించుచున్న విద్యామంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు ఆరోజు సాయంత్రము, బందరు పురమందిర సభలో ఉండగా ప్రచండమగు గాలి ప్రారంభమయింది. ఆ గాలిలోనే, నిడుమోలు వెళ్ళి, సభలో పాల్గొని, హైద్రాబాదుకు వెళ్ళవలెనని, రోడ్డుపై కొంత దూరము వెళ్ళునరికి, పెనుగాలికి చెట్లు పడిపోయినవి. అంత వెనుకకు తిరిగి వచ్చి, బందరు సమీపమగు సుల్తాన్ నగరం, గొల్లపాలెం దగ్గఱకు చేరునరికి, ఎన్నియో చెట్లు విరిగి, రోడ్డుకు అడ్డంగా పడినవి. వారి కారు వెనుక భాగముపై తాడిచెట్టు విరిగిపడినది - ఆ రాత్రి అంతయు ఆ తుఫాను భీభత్సస్థితిలో, కారులోనే ఉండి, తెల్లవారు ఝామున గాలి తగ్గిన తరువాత బందరు చేరి, దెబ్బతిన్న ప్రాంతముల అధికారులతో కలసి, పర్యటించి, సహాయ కార్యక్రమములు నిర్వహించినారు—

## 22) 19-11-1977 వ తేదీ - శనివారం - ఉప్పెన.

నేటి ఉప్పెన, వెనుకటి 1864 నవంబరు 1వ తేదీ బందరును, చుట్టుప్రక్కల పల్లెల, గ్రామములను పూర్తిగ నాశనము చేసిన, ఉప్పెన మాదిరి, దురంత, దారుణ, దుస్సహమైన, అనూహ్యమైన ప్రళయ ఉప్పెన యిది. ఆనాడుదయము గం. 10-30 లకు వీచిన ప్రళయగాలికి, పాకలు, భవనములు, చెట్లుచేమలు, సమస్తము మొదలంట కూలిపోయినవి. సాయంత్రము గం. 3-00 - గం. 4-00 లకు ఆకాశము కావిరి క్రమ్మి, అంధకారబంధురమై. భీభత్స స్వరూపముగా పొడకట్టినది. ఆ రాత్రి గం, 6-30, గం. 8-30, గం. 10-30లకు క్రమక్రమముగా, తీవ్రమైన పెనుగాలి తాకిడులకు - బందరు, దివిసీమల, గ్రామగ్రామముల, సముద్ర తీరమున గల

జాలముల, కొంపలు, పశుల కొట్టములు సమస్తము నేలకూలినవి. 12, 13 అడుగుల యెత్తున లేచిన, సముద్ర కెరటాలకు, జనము, జంతు జాలములు కొట్టుకొని పోయినవి. దివిసీమలోని, నాగాయలంకకు, 6 మైళ్ళ ఆవల, భావదేవరపల్లికి సామీప్యమునగల, కమ్మనవోలులో, సాయంత్రము గం. 4-00 - 4-30 లకు సముద్రపు నీరు పొంగి ముంచెత్తినది. ఆ పొంగు, నాగాయలంక చేరునప్పటికి, నాలి సంగమేశ్వరము వద్ద, బడబాగ్ని వెలుగు కనుపించినది. కమ్మనవోలు బావ దేవరపల్లిలో గం. 6-0 లకు 18 అడుగుల లోతున నీరు, అలలతో పొంగి ప్రవహించినది. రాత్రి గం. 8-30 లకు, హంసలదీవి సమీప సముద్రతీరమున లేచిన బడబాగ్ని వెలుగు కొన్ని మైళ్ళవరకు కనుపించినది. ఆ బడబానలములో లేచిన 13 అడుగుల సముద్రపు కెరటాలు, సుడులు వారుచూ, వేగముగా చుట్టుముట్టి, సకల జీవరాశులను, చెట్లను, చేమలను, సమస్త ప్రదేశమును, ముంచు ప్రవాహగతికి నిల్వలేక, సమస్తము సముద్రపు నీట జారజొచ్చెను. ఇంటి కప్పులు, పాకలు, నీటరాలి కొట్టుకొనిపోయినవి. అచ్చటచ్చట, చెట్ల కొమ్మలు, ఇండ్లకప్పులు, ఆ చలినీటి గాలికోర్చి, తలదాచుకొని, యే కొందఱో బ్రతికిరి. ప్రవాహమున, కొట్టుకొనిపోయిన జీవులు, జంతుజాలములు, అసంఖ్యాకములు, క్రమ్మిన గాఢాంధకారములో కెరటాల పోటు, పెను మ్రోత, సుడులతో ప్రక్కకీడ్చుకొని పోవు, ఆ ప్రవాహగతి, ఆ ప్రవాహములో యెన్నియో మృత కళేబరములు, కొన్ని అంగవిహీనములై, చెల్లా చెదరై, కొట్టుకొని పోవు, భీకర దృశ్యము. ఆ రాత్రి, మరునాడు, ప్రపంచమును, బంధుమిత్రులను బ్రతికి చూడగలమా ! అనే నిస్పృహ, నిరాశ, నిరుత్సాహము, భయాందోళనలు, ఒక్కుమ్మడి ప్రతి జీవిని ఆవరించినవి. వేలకొలది జీవుల పొట్టను బెట్టుకొనగా, మిగిలినవారి ఆక్రందనపు ఘోష, వారివారి హృదయవిదారకములగు చరిత్రలెంత

వారికి వినినంత, దుఃఖము పెల్లుబుకుచుండెను. రాత్రి గం.10-00 ల తరువాత, పెనుగాలి గుంటూరు మండలము వైపునకు మరలి, రేపల్లె, బాపట్ల చుట్టుప్రక్కల గ్రామపరిసరముల గల పంటల పూర్తిగ తుడిచి పెట్టినది. మరల గం. 10-30 తరువాత, ఆ ప్రకారము, పెనుగాలి తిరుగక, యింకను కొలది కాలము, ఆ ప్రళయ తుఫాను సాగినచో, బందరు, బందరు పరిసరముల, పరిస్థితులెట్లుండెడివియో అనూహ్యాము. అంతలో అది, తిరుగు ముఖము పట్టుట, అందులో కొంత అదృష్టమని చెప్పవలె—

ఇచ్చట - నాటి ఒక ముఖ్య విషయము జ్ఞప్తికి తెచ్చుచున్నది. అది యిది. విద్యా, సాంస్కృతిక శాఖామాత్యులు, శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు 17, 18 తేదీలలో గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాలలో పర్యటించి, హైద్రాబాదు వెళ్ళవలసియుండెను. తన కార్యక్రమము మార్చుకొని 18 రాత్రికి ఏలూరు నుంచి సరాసరి బయలుదేరి, స్వస్థలమైన అవనిగడ్డకు చేరారు. 19-11-77 ఉదయము శ్రీ కృష్ణారావుగారు, గాలివానలోనే, 'షాలిమ్' హాస్టలులో 80 మంది, ఆడపిల్లలను ఖాళీచేయించి, సేవాశ్రమమునకు చేర్చిన, కొద్ది నిముషములకే, ఆ యిండ్లు పడిపోయినవి. భయోత్పాతమునకు బైటికి వచ్చి, గాలికి కొట్టుకొని పోవుచున్న 20 మంది పిల్లలను చేతపట్టుకొని రక్షించి, తానుకూడ, ఆ వీచే గాలికి, తట్టుకోలేక పడిపోయిరి.

ఉప్పెన వచ్చిందని తెలిసి, 20వ తేదీన బయలుదేరి, ఉప్పెనచే తుడిచిపెట్టుకొనిపోయిన గ్రామములకు కొంతమందితో వెళ్ళారు. ఒక ప్రక్క శవాలు-ప్రజాసేవ ప్రధానమైనదని-తన మంత్రి పదవికి రాజీనామా చేసిన-ప్రజా నాయకుడు - మన మండలి. వారి అవిరళ కృషి యెంతయో ప్రళయ కాలంలో ప్రగతికి **మార్గము చూపినట్లయినది.**

బీహారు భూకంప భీభత్స సమయములో అహర్నిశలు సేవజేసిన త్యాగ పురుషుడు డా॥ శ్రీ రాజేంద్ర ప్రసాదుగారి సేవకు సాటిగ ఉన్నది. ప్రజానీకము, అనేక పెద్దల మన్ననల నందుకొన్న మన 'మండలి' సేవ యెన్నడు మరువరానిది—

ఇచట తుఫాను అనంతరము సాగిన పునరావాస కార్యక్రమము లలో, యెన్నియో స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు, ప్రభుత్వము, త్యాగ దృష్టితో ఔదార్య బుద్ధితో, రేయింబవలు, కుల, మత, శాఖ, జాతి విచక్షణ లేకుండా, దివితాలూకా అవనిగడ్డ ప్రాంతమందలి, ఆ ప్రళయ తుఫాను భీభత్స చర్యలకు రూపుచెడి, నేలమట్టమై దరిజేరలేని రొంపి, బురదలో, ముళ్ళ డొంకలలో, చెల్లాచెదురుగా పడియున్న మృత కళే బరములకు, ముందు విమోచన కలిగించి, ప్రణాళికలు, అంచనాలు వేసి, ధన ప్రవాహము కురిపించి, చెమటలోడ్చి, శ్రమపడి క్రొత్త భవనములు నిర్మించారు. సముద్ర తీరము వరకు రహదారి రోడ్డు నిర్మించిరి. కావలసినవెన్నియో సౌకర్యములు కలుగజేశారు. దాదాపు 14, 15 సంస్థల వ్యక్తుల నిర్విరామ కృషివలన దివిసీమ యిప్పుడు దివ్యసీమగా రూపొందింది. ఆయా సంస్థలు, తమ, తమ సంస్థలు నిర్వహించిన కార్యక్రమములు, వినియోగించిన ధన, వస్తు సంబారము లను సేకరించి వెచ్చించిన ధనము మొదలగు వానికి లెక్కలతో సంచికలు ప్రకటించిరి.

అందు 'సార్లగొంది' పునరావాస కార్యక్రమములు నిర్వహించి నది, కేవలము రక్షణశాఖ (పోలీసు) వారి సహకార, సేవా వివర ములు కృష్ణాజిల్లా పోలీసు సూపరింటెండెంటు శ్రీ యస్. వీరనారా యణరెడ్డిగారు, వారి సంచికలో ప్రకటించిన భాగములోని కొన్ని విషయములు—

లోగడ 1864, నవంబరు 1తేదీ; నేటి 1977 నవంబరు 19 తేదీ తుఫానుల వలన, వస్తునష్టము మరణములగురించి తెలిపిన వివరములు-1274 ఫసలీకి రు. 3,34,900లు నష్టపరిహారములు-మచిలీపట్టణము చుట్టు, నష్టపడిన భూమి 1,43,187 యకరములు, దాదాపు 224 చదరపు మైళ్ళ వ్యాప్తము కలది. గుంటూరు జిల్లాలో 34 చదరపు మైళ్ళ వైశాల్యముగల గ్రామములలో - 24,100 యకరముల భూమి నష్టపడింది—

ఇటీవల తుఫానుకు గురియైన, పంట నష్టము రు.14,70,395 లక్షల విలువగల 8·547 లక్షల యకరముల పంట భూమి, లోగడ తుఫానుకు 30వేల మంది జననష్టము. అప్పుడు భూమికి సంభవించిన నష్టము తీవ్రమైనది - పంటభూములు ఉప్పునీటికి, కారు చెందినవి. ప్రవాహమునకు కొట్టుకొని వచ్చిన ఉప్పు అచ్చటచ్చట గుట్టలు గుట్టలుగా పేరుకొన్నది. పంట ఉప్పునీట మునిగి నాశన మైనది. ఈ ఫసలీకి నష్టపరిహార విరాళములు పెద్ద మొత్తములు మంజూరైనవి. ముందునాటికి వచ్చే పంట బాగుంటుంది కాని, బల కరంగా ఉండదు. కొన్ని సంవత్సరములు గడచినగాని, ఉప్పు నీరు పూర్తిగా విడిపోదు. మామూలు పంట లభించుటకు కొంత కాలము పట్టును—

జిల్లా కలెక్టరు శ్రీ థారన్ హిల్ మహాశయుడు, దేశము విడచి వెడలు, వీడ్కోలు సందర్భమున, ప్రజలు యిచ్చిన కృతజ్ఞతా పత్రము నకు సమాధానముగా 'ఇది వరకెన్నడు కని, విని యెరుగని ఉప్పెనకు నిల్వగలిగిన ప్రజల ధైర్య స్థైర్యములకు మెచ్చుకొని, మనకు సంభ వించిన నవంబరు మహావిపత్తుకు ప్రజలు తట్టుకొనకలిగిరి. ఇదే గనుక ఒక దారిద్ర్యదేశంలో అయితే, ప్రభుత్వమెంత చొరవ తీసి

కొన్నను, ఆ ప్రళయము నుంచి బైటపడుట దుర్లభము! మంచినీటి కొరత, తిండి వస్తువుల కొరతకు తోడు, పట్టణము నిండ చెల్లా చెదురుగా పడియున్న మృత కళేబరముల విమోచన ప్రజలకు తీరని సమస్య అయింది.'

పోలీసు శాఖపై ఒకప్పుడు ఒక అపోహ ఉండేది. తమ ప్రక్కనుగల శవాలను తొలగించవలసిన విధి తమది కాదని అట్లనే మిలిటరీ శాఖవారు కూడ మృత కళేబరములను తొలగించుట తమ ఉద్యోగధర్మము కాదన్నదే భావం- 'పూర్వము యిట్టి విషమ పరిస్థితు లలో, మన పెద్దలు యెట్లు తట్టుకొన గలిగిరో కదా!' అన్న ఆ థారన్ హిల్ వాక్యములు, ఆజ్ఞగా పాలించుట మొదటి ధర్మము. కష్ట నష్టముల గురించి, పోలీసు మిలిటరీ శాఖలు కలసి, పడ్డ గుంజాటను తొలగించి, తమ ధర్మము నిర్వహించినారు. ప్రజలు, ప్రభుత్వము కలసి యే రవ్వంత లోటులేకుండా, సేవజేసిన వారికి, మన కృతజ్ఞతలు. లేనిచో మన తిప్పలు దేవుడికే తెలిసేవి. మృత కళేబరముల విమోచనకు, సివిల్, మిలిటరీ ఆఫీసర్లు, అన్ని స్థాయిలవారు, అన్ని తరగతులవారు, వారు వీరనక, యెల్లరు యెంత యుత్సుకత చూపించిరో మీకు తెలుసు. నేటి తుఫానులో, అంటు వ్యాధు లేమాత్రము పొడసూపక పోవుట ఆశ్చర్యకరమగు విషయము-ఉప్పెన తీసిన తరువాత మచిలీపట్టణ వాసులు కలెక్టరు థారన్ హిల్ చేసిన మేలునకు కృతజ్ఞతాపూర్వక చిహ్నముగ, పట్టణము మధ్య చౌకులో నేడు కనుపించుచున్న స్థూపము నిర్మించినారు. ఒక మహా ప్రళయా నంతరము దానికి మారు, క్రొత్తవెలుగు అందించే కార్యక్రమములుగ నాటి ప్రభుత్వము అనేక పథకములు చేపట్టింది. ముఖ్యముగ వ్యవ సాయ విషయమై, పునరావాస గృహ నిర్మాణము వగైరా పనులలో, నేడు యిచట సమిష్టిగా జరిగిన కార్యములకు, వాటికి పోలిక లేదు-

సాగుకు, త్రాగుటకు మంచినీరు కృష్ణానది నుంచి మచిలీపట్టణమునకు మంచినీళ్ళ కాలువ త్రవ్వించి, నీరందించింది. మామూలు రోజులలో కూడ త్రాగుటకు మంచినీళ్ళులేక ప్రజలు బాధపడేవారు. ఆ ప్రణాళిక చేపట్టిన సాహసి సూపరింటెండెంటు యింజనీరు గారు శ్రీ ఐ. సి. ఆండర్సన్ మహాశయుడు. వారి వీడ్కోలు సందర్భమున పట్టణ వాసులు వారితో, 'కృష్ణానదీ జలం త్రాగేవేళ, యే ఒక్క జీవి మిమ్ముల స్మరించకుండ ఉండలేడు' అన్నారు—

నేటి బాధ్యతాయుత ప్రభుత్వము అజమాయిషీలో నేటి తుఫాను తరువాత, రాకపోకలకు, సలహాపై విశాలమగు రోడ్లు నిర్మించి, ప్రజలకు పక్కా గృహములు నిర్మించి యిప్పించింది. అనేక స్వచ్ఛంద సంస్థలు, త్యాగ, సేవా ఫలితముగా, యీ శిధిలాల నుంచి, అనేక క్రొత్త గ్రామాలు, యక్షిణీ మహిమలాగ, యిట్టే ఉద్భవించాయి. ప్రతి విపత్తులోను, పోలీసు శాఖ, తాత్కాలికముగా వెళ్ళి ఆ బాధనుండి విముక్తి చేస్తుంది. కాని గండము గడచిన తరువాత, వారి సేవ తలచే వారే అరుదు. ఇది, అట్టి మామూలు పరిస్థితికాదు. 1864లో కూడ పోలీసు యినస్పెక్టరు జనరల్ శ్రీ డబ్ల్యూ. రాబిన్సన్‌గారు పోర్టుసెంటు జార్జి, ప్రభుత్వ కార్యదర్శి శ్రీ ఎ. జె. అర్బత్‌నాట్ గారికి తెలియ బరచిన సమాచారములో, 'ప్రళయతుఫానుకు 20 మంది పోలీసులు, యింక యితరులెందఱో హతులైనారు. వారి సర్వస్వము నష్టమయింది. వారి బంధువులెందరో మృతిజెందిరి' అని, నాటి పోలీసు సూపరింటెండెంటు, తన సిబ్బందికి కలిగిన నష్టము 95 వేల రూపాయలుగా స్టేటుమెంటులో వివరించిరి.

తదితర జిల్లాల పోలీసు శాఖవారు వారికెంతయో సహాయ సంపత్తులందించిరి. ఇది యెంతయు మెచ్చుకొన దగిన విషయము.

బాధతో సతమతమగు వారికి, తోటిసేవకులుగా, వారికి రు. ౫ వేలు రూపాయల విరాళమందించిరి. అదిగాక, మచిలీపట్టణ స్థానిక మిలిటరీ వారు, మరణించినచో, ఒక్కొక్కరి మామూలు రెండు మాసముల జీతము మొత్తము విరాళము యిచ్చేవారు. ఆ విధముగా యిచ్చు టయు, వారు స్వగ్రామముల జేర, రాకపోకల ఖర్చుల క్రింద రు.500 లకు తక్కువ కాకుండ మంజూరు చేయుటకు ప్రభుత్వమును అర్థించింది. కాని ప్రభుత్వము ఒక నెల జీతము మాత్రమే విరాళము మంజూరు చేసింది. మిగతా సూచనలు పాటించలేదు.

నేటి తుఫాను సందర్భమున, సహాయమందించుటకు, మన రాష్ట్రమందలి పోలీసులు, క్రిందినుంచి పై ఆఫీసరు వరకు, ఒక రోజు వేతన మొత్తము విరాళ మొసంగుటచే కూడిన, 20 లక్షల రూపా యల ఖర్చుతో, సొర్లగొంది గ్రామ నిర్మాణమునకు, యీ సాహసిక మైన, యుదారమగు పథకమెంతయో సాధింపబడింది. నాడు సమా జమునకు, పోలీసు శాఖ చేసిన, బహుముఖ సేవా ఫలితములే స్మృతి చిహ్నముగా నిలచిన సొర్లగంది పథక స్వరూపము.

బందరు పట్టణ పూర్వ గాథల విచారించి పరిశీలించినచో యెందుకీ మహాపట్టణము, యేటి యొడ్డున బిడ్డగా, సముద్రపు వొడ్డున గెడ్డగా, కనుబొమలమీది వెంట్రుకలుగా, యెదుగు బొదుగులేని, గొడ్డె తోకగా, అభివృద్ధి నందని, దుస్థితి యేమిటి! యని, నేటికీ యెందఱో ప్రశ్నింతురు. నిన్న మొన్న వెలుతురు గొన్న, చిన్న చిన్న పల్లెలు పట్టణములై, మహా పట్నములై, యెనలేని వృద్ధినందుట జూడ, యెన్ని యేండ్లు గడచినను, యెన్ని తరములు దాటినను, యెన్ని ప్రభుత్వములు మారినను, ఎప్పటికి, యిప్పటికీ పాత పట్నముగానే బందరు గోచ రించు దురదృష్టము ఏమిటని ప్రశ్నించువారలున్నారు. అధి

అందఱకు దృగ్గోచరమే! కొందఱు వాస్తు శాస్త్రజ్ఞులు, యీ నగర శంఖుస్థాపన ప్రారంభ సముహూర్త మహిమ యని, కొందఱు యీ పట్టణము సరియైన దిశగా, అనగా సూటిగా గాక, (తూర్పు, దక్షిణ, పడమర, ఉత్తరములకు సమమగు ఎదురుగా గాక) దిక్కులు జూచు వీధులు, యిండ్లు నిర్మించిన వాస్తు ప్రభావము, యిప్పటికి ఒక దిక్కు గానని స్థితికి గొని పోవుచున్నదను అశ్లీల భావము ప్రకటింతురు. వీనినన్నిటిని మించిన హేతువు లేకపోలేదు. బహుశా కారణమదే కావచ్చు. ఏదయిన - ఎడతెరిపిలేక, ఏటేటా, ఎదుర్కొనే, జల ప్రళయములు, పెనుతుఫానులు, ఉప్పెనలు కుంభపాత వర్షములు, ప్రళయ గాలి తాకుడులు, మొదలగువాని వినాశక చర్యలకు, మూలమట్టముగ ధ్వంసమైన దుస్థితిలో, మరల పునర్నిర్మాణము గావించుకొను యత్నములో గ్రుక్కతిప్పుకొనలేని, అల్ప సంధికాలములో (వ్యవధి) మరల ప్రళయములు ముంచెత్తి, పట్టణమును, రూపుమాపుజేయ, యెప్పటికి యీ పునర్నిర్మాణము? క్రొత్త రూపురేఖల అభివృద్ధి సూచక నిర్మాణ కార్యక్రమాల గుర్తింపు లేమూల? ఈ ప్రకృతి వంచనకు, యెంతవారైన, తట్టుకొని, యెదురీదలేరు కదా! ఇంతకు మించి ప్రభుత్వ దృష్టిలో, నాగరకతకు, భారతీయ సంస్కృతికి ఆలవాలమగు, యీ పట్టణాభివృద్ధికి యేర్పరుచుకొన్న ప్రణాళికలు, కార్య రూపమున, అంతగా ఫలింపక పోవుట దురదృష్టము. అదియును గాక, రాష్ట్ర ప్రభుత్వాధికారులు, కేంద్ర ప్రభుత్వాధికారులు, నియమించుకొన్న కార్యక్రమములలో, సావకాశముగా బందరు కేతెంచి, నిబారించు విశ్రాంతి, ఔదర్యము అంతగా కానరాక, కొంత దృష్టి పథములో ప్రాధాన్యమీయక పోవుటయు, కారణములుగా జనవాక్యమున్నది. జిల్లా కేంద్ర స్థానమగు బందరును దర్శింపకయే, తమ త్రోవలో అందుబాటుగా ఉన్న విజయవాడలో మరొక చోటనో, కొలది కార్య

క్రమములు నెరవేర్చుకొని చనుటయు, అయా పెద్దల దృష్టిలో యీ పట్టణమంత స్థాయిలో ఆకర్షింపక పోవుటయు బందరు దురదృష్టమని కొందరనుకొనుట విదితము. పూర్వ సంప్రదాయక, సాంస్కృతీ వైభవములు, పునరుద్ధరించు దీక్షా బద్ధుల కృషి యేనాటికైన ఫలింపక పోవునా, అనే ఆశ యెప్పటికప్పుడు మిగులుచున్నది. ప్రఖ్యాత చారిత్రకమగు బందరు పట్టణము, ప్రభుత్వము వారి అండ దండలతో, ప్రజల సహాయ సంపత్తి, అభిమానములతో; రాగల భవిష్యత్తులో, పురోభివృద్ధి, యితోధికముగా నందగలదని యాశింతము—

ఈ పైన ఉదహరించిన, ప్రళయ స్వరూపమగు ఉప్పెనల గురించి, 'కాళరాత్రి' అనే శీర్షికతో, పద్యరూపమున చిన్న ఖండ కావ్యముగ వెలువరించడమైనది- ఈ పద్య సంపుటికి అనుబంధముగా, తూర్పు సముద్ర తీరమును బాధించిన ముఖ్యముగ, బందరు పట్టణమును గత కాలములో ముంచెత్తిన ఉప్పెనలు, గాలివానలు, వర్షపాతముల చరిత్రలు తెలిసినంత వరకు, సమాచారము భోగట్టా చేసి, యీ గ్రంథమున పొందుపరచితిని. అదిగాక 1864 ప్రళయ ఉప్పెన, దాని ప్రళయ భీభత్స కృత్యములు స్వయంగా వీక్షించి, నాటి వృత్తాంతము పద్యరూపమున వెలువరించిన, రాయభట్టు వీరరాఘవ భట్టు కవి సీసమాలిక కూడ యిందు పొందు పరచితిని.

ఇది చారిత్రాత్మకముగా, మిగిలి, నిలచిన, ప్రళయ కాళరాత్రి, గాథా స్వరూప కథనము—

గురుజాడ రాఘవశర్మ



బందరు కోటలో 1864-11-1 ఉప్పెన స్మారక చిహ్నముగా •
కానవగు శిలాశాసనము

# కాళరాత్రి

## అనుబంధం II

# 1-11-1864 బందరు - ఉప్పెన

## నాటి ఉప్పెన గురించి - సీసమాలిక.

కవి, దివి తాలూకా - మాచవరం కాపురస్థుడు,

శ్రీ రాయభట్టు వీరరాఘవకవి (1820 - 1910)

—oo✿oo—

ఆ భాగమును ది 3-2-1978 తేదీ ఆంధ్రపత్రికలో 'సిసలైన-తుఫాను. సీస పద్యం' అనే శీర్షిక క్రింద - కళాప్రపూర్ణ శ్రీ నిడదవోలు వెంకట్రావుగారు ప్రచురించిన భాగమున్నూ, ఎన్నాళ్ళనుంచియో దీనికై గాలించుచున్న నాకు దివితాలూకా అవనిగడ్డలో లభ్యమైన ఆనాటి శిధిలమైన వ్రాత ప్రతిన్ని - ఒకే మాదిరిగా ఉన్నవి. కాని కొన్ని మార్పులున్నవి. పత్రికలో అవి యధాతధంగా ప్రచురింవబడింది. నేను యీ రెంటిని పరిశీలించి, వీలైనంతవరకు, యొప్పిదమగువాని సవరించి, పూర్తి పాఠము, పాఠకులకందింపగల్గుచున్నాను, వీనిని, నేను ప్రచురించు 'కాళరాత్రి'కి, అనుబంధముగా వెలువరించుచున్నాను. పాఠకమహాశయులు నాటి, ఉప్పెన, గాలివానల భీభత్స స్వరూపము గుర్తింతురుగాక.

శ్రీ కళాప్రపూర్ణ శ్రీ నిడదవోలు వెంకట్రావుగారు, పత్రికలో ప్రచురించిన దానికి వారి పరిచయము—

'రౌద్రి సంవత్సరములో వచ్చింది గాలివాన. రక్తాక్షిలో వచ్చింది బందరు ఉప్పెన. ఇది ఆంధ్ర జాతీయ విపత్తు. 1-11-1864 నాడు ఉదయము ఏవో కొద్ది తుంపరులు పడ్డాయి. ఆనాడు 'ఆర్సేమిట్నుండే - చిలికి చిలికి వాన, గాలికి తోడై, మధ్యా

హ్నాము 3 గంటలకే బందరులో కటిక చీకటి. నోబుల్ దొర, బడి కట్టివేశాడు. అయినా కలెక్టరు 'థార్నహిల్', 6-30 దాకా ఆఫీసు లోనే ఉన్నాడు. గుమాస్తా లేమయ్యారో, తెలియదు. కల్లు, సారాయి బ్యారెల్స్. ఒక దాని కొకటి కొట్టుకొని పగిలి రోడ్డు మీద ప్రవ హించాయి. రాత్రి గం. 10-30 - 11-00ల మధ్య 13అడుగుల ఎత్తు కెరటం శవదాహంతో బందరుపై పడింది. బ్రాహ్మణ శివగంగలో 700 మంది బ్రాహ్మణులను మ్రింగలేక, 70 మందిని మిగిల్చింది. ప్రఖ్యాత పండితుడు, హిందీ నాటకకర్త శ్రీ నాదెళ్ళ పురుషోత్తం జలగండం తప్పించుకొని బయట పడ్డాడు.

బ్రతికి బయటపడ్డవారిలో శ్రీ రాయభట్టు వీరరాఘవ కవి (1820 - 1910) రాత్రంతా ఎట్లాగో గడిపి మర్నాడుదయం, ఆవేదనతో ఒక సీసమాలిక రాశారు — బందరు ఉప్పెన గురించి ఎన్నో వ్యాసాలు, వర్ణనలు, కవులు వ్రాయడం మొదలెట్టారు. అప్పటి, కంటె మొదట రాసిన తుఫాన్ కవిత ఇదే. సీసమాలిక, కొంత విసుగ్గా ఉన్నా, అప్పటప్పటి జల ప్రళయం కన్నుల గట్టినట్లు వీర రాఘవ కవి వర్ణించాడు. అందుకైనను, మనం చదవాలి. ప్రఖ్యాత చారిత్రకులు, శ్రీ కొడాలి లక్ష్మీనారాయణ 1970లో రాయభట్టు వీరరాఘవ కవి రచనలు అనే శీర్షికలో ప్రచురించిన గ్రంథములో ఉంది ఈ సీస మాలిక. వారికి కృతజ్ఞత—

## 1864 – బందరు - ఉప్పెన - సీసమాలిక

రక్తాక్షి సంవత్సరంబున కార్తీక
　　శుద్ధమందున, భూమిసుత దివంబు
విదియనాడుదయంబు - మొదలౌతుషారంబు
　　అంతంత కెక్కువై - యంతకముగ

ప్రొద్దుగ్రుంకెడి వెన్క పొగరు తుషారంబు
గాలివల్లనె, లావుమీరి లేచి
ఉత్తరంబున బుట్టి - మొత్తె, పెళ్ళగిలగా
కూకటి వ్రేళ్ళతో కూలె తరులు,
అచలంబు, లల్లాడె, అవని తల్లడమందె
దక్షిణ దిక్కంత తక్షణముగ
అతత సేతు శీతాచల మధ్యను
తెలియ భప్పన్నారు దేశములను
ద్వారక తొల్లి దూర్వాస శాపంబున
అమరేంద్రు సిరికన్య అణగినట్లు
బందరు పుర లక్ష్మి పటు దుర్దశను బొందె
మొనసి ఉప్పెన లోన, మునుగు కొరకు
కలియుగంబున పాప కర్మంబు లెక్కువై
సత్యంబు ధర్మంబు సన్నగిల్లె
భేరీ మృదంగాలు, బిరుదు సనాయిలు
సవుబత్తునున్, నగాగార మ్రోత
వాయుదేవునకు, సహాయులై దేవతల్
సంగీతములు, బాడసాగి రవుడు
తళుకుచు పాతాళ ఉళుములు మెఱుములు
పగటి వత్తుల రీతి పరిఢవించె
లయకాల రుద్ర లలాటనేత్రాగ్నిగా
భగ్గుభగ్గున మండి తగ్గకుండె
పిడుగులు బడబాగ్ని పిల్లలో యనురీతి
నిప్పుల కుప్పలు తెప్పదేలె

కలగి తిమీ తిమింగలము లింద్రాయ, క
ర్కాట కోద్ఘాట నికాయలోక
భీకరాలీల మండూక వక్రగ్రహ
గుభ గుభ ధ్వానంబు గుబ్బతిలగ
గాఢాంధకారమై ఘన ఘన జ్యోతులు
కటిక రక్తచ్ఛాయ, గడలు కొనగ
అసమాన తరమైన, లవణ సముద్రిత
రంగంబు లాకాశగంగ తోడ
సంగమక్రియకునై చనియెనో యను రీతి
వింశతి యోజనాల్ వెనుకదీసె
రాఘవ రింకలా లక్ష చేతులు జాచి
దుమికెను దొంగ ప్రొద్దున్న కరణి
హంసలదీవి, మూలందున బయలెక్కి
వరదగా పరదెంచె ధరణి మీద
వెయితాళ్ళ యెత్తున, వెడలుపు పొడుగొచు
దరి పల్లెటూళ్ళు ముందరగ ముంచె
అవి, యేవియంటేను - యరసి, గరాల్దిండి
గిలకల దిండి, చాన్రింద దిండి
తుమ్మల మర్రియు గ్రిమ్మ సంబలదీవి,
ఊట గుండాలను గీటడంచె
సాగి చెంగలరాయ సత్రమ్ము హరియించె
క్రొత్త సావిళ్ళన్ని యెత్తి ముంచె
పెద గొల్లపాలెము, చిన గొల్లపాలెము
ని[illegible]కడి దప్పించి, నెగడి విడచె

చెంగట తప్పిపూడ్ మంకెనపూడియు
పరగ పాచ్చాఫురీ బంటుమిల్లి
చెడముంచి, యటు దివిసీమకు ప్రభవించి
నాల్కలు నోరి మిన్నంది పొంగి
మంద పాకల ద్రుంచి - మాల పల్లెలు ముంచి
కోడూరు మును ముందు, పాడుజేసి
పిట్టల లంకంత పెరికి, రెండిళ్లుంచి
నారి పాలెమ్ము, పెన్నార్చి, పీల్చి
సాలెము పాలెము - చప్పంగ దిగమ్రింగి
పరగ లింగారెడ్డి పాలె మార్చి
తురకల పాలెమ్ము తుదముట్ట చల్లార్చి
భావదేవరపల్లె, ఆవరించి
నెట్టుచు నగమూరు చుట్టుముట్టుగ లేచి
తలగడ దీవికి దాకి తిరిగి
మాచవర గ్రామమంత మట్టును పెట్టి
దొడ్డి లోపల చేలు, బుడ్డముంచె
శోధించి యిటు విశ్వనాథ పల్లెయు, ముంచి
పెద్ద కళ్ళేపల్లి పెనగ తిరిగి
కృష్ణా నదీ దరి కేగి, బందరు డాసి
పడమటి దిక్కుకు, ప్రాకియట్లు
గుండు పాలెముః, నెల కుర్రు, కోనయు ముంచి
చిన్నాపురమ్ము, నశింపజేసి
దండించి మల్లవోల్, యండ కుదురు ముంచి
రామన్నపేట, నీరధిని గల్పి

పటు పూషడము, వాడపాలెము, యాదర,
లంక పల్మాలపల్, పొంకమడచి
భోగిరెడ్డి పల్లి, సాగరంబున గల్పి
ఆటు రెండు మాజేర్లు పుటములేపి
మంగళాపురమును, మానక ముతరాచు
పాలెము, పీస్గు దిబ్బలుగ జేసె
పాల చెల్లుడవిని, బడి చల్లపలి, పెద
ప్రోలు తూర్పున, వంద్రు బురద బెట్టి
బస్తీకి సాగుచు, కస్తిగా నొనరించి
తామసాగ్రంబున దాపరించి
మొట్టమొదటను వేగ, ముంచెను శివగంగ
అగ్రహారము మీద నిగ్రహించి
(మంత్రిపాలెము రూపు మాయజేసి)
బ్రాహ్మణోత్తములింటి పట్లగపడకుండ
ఇసుక గుండాల్ వేసె, కసిమనంగి
ఖాలికానని పేట గ్రమ్మి కాల్వలు ద్రవ్వి
వంతెన పడవలు వనధి గల్పి
చింతక జీస్గుంట, చింతపాలెం బంత
దేశాయిపేటంత, గాసి జేసె
అంతట, ఇనుకుదు రాని, తాపెట్టున
జగినుపేటంత, ఊడ్చిపెట్టి
బచ్చుపేటంత చప్పంగ వారిధి ముంచి
కూలంగ జేసె, జాలారుపేట
వెట్టి జాతర జేసె పెదరాజు పేటంత
జవ్వాదిపేటంత జలధి గలిపి

దాటె గొడుగుపేట, దరి, రాపసను పేట
గుండముల్ వేయుచు, కొట్లుముంచె
వైశ్యుల నరకులు వర్తక నరకులు
కొబ్బరి బెల్లము, కొట్లుగిట్లు
నేతి సిద్దియలు, తేనియ, లాముదము, నూనె
వెల్లుల్లి, యింగువ, నల్లమందు
ఆకులు పోకల్, పొగాకుల పెండెలు
చింతపం, డుప్పును, జీలకఱ్ఱ
మెంతులావాలును, మిరియాల్, లవంగాలు
యాలకులును, మోడి, పిప్పలియును
బలు జాజి, జాపత్రి, పసుపు, వామంబును
పాదరజంబులు, పంచదార్లు
చెన్నారు పరిమళ పొన్నారి కస్తూరి
గంధపు చెక్క, సాంబ్రాణి, యగరు
పునుగు జవ్వాదులు, అరుదగు నత్తర్వు
బుడ్డులు, మంచి కర్పూరములును
వడ్లు, జొన్నలకొట్లు, వలనొప్పు, పెసలును
కందులు, నువ్వులు, కడు శనగలు
కొఱ్ఱలాముదములు గోధుమలాదిగా
నవధాన్య రాశుల నానబెట్టె
నెరజరీ వస్త్రాలు, శరధి లోపల గల్పి
ఖాజ్జిల్లిపేటను, కుశలపరచి
బుట్టయ్యపేట, చేపట్టి కొద్దిగముంచి
చెమ్మనగిరి పేట, క్షేమమరసి

బలరాము పేటలో బలహీనులన్ ద్రుంచి
పాతరామనిపేట పరగ దిగివి
నరికిల్లి పేటంత చప్పగా దిగమ్రింగి
ఆ వలందుల పేట హతము జేసి
గాసిగా జేసి, పరాసుల పేటంత
యీడె పాలంబంత యిండ్లు లేపి
మాచవరంబంత, మాయించి, అటుదాటి
బల్లెల గూడెమ్ము పాడుజేసి
లో బంద రంత, కల్లోలంబు గావించి
కందకంబున బడి, కడుపునిండ
కలకటేరి కచేరి, కరచి, కరంగించె
ఆ సభ లోపల నధికుడైన
వరమేశవరదుడు, పురుషోత్తమయ పూర్వ
పుణ్యంబు చొప్పున పుడమి బ్రతికె
మహి జమీందార్లు, గుమాస్తాలు, దస్త్రాలు
సర్కారువారి, కజాణ, ముంచె
బయట సిపాయీల లయము గావించెను
చిలకలపూడి, శాసింపజేసి
చిరతరంబైన, దేవరకోట సీమలో
పట్టణంబులు, ఊళ్లు, పట్టి చూచె
నందులు, గొందులు, సావిళ్ళు, లోగిళ్ళు,
మేడలు, మిద్దెలు, గోడలు, మరి
రచ్చలు, క్రాంతలు, రాజ మార్గంబులు
విపటి జనంబులు, విరులు, నరులు

బంకులు, బొంగుల, పెంకుటి బిళ్ళల
యిండ్లు, పూరిండ్లును, గుండ్లు, గుళ్ళు
బోషాణములు, గొప్ప పాషాణచయములు
దూలాల్, తనాబాలు, దొడ్లు, దొడ్డ
ఓడలు, పిన్నిను లొగినెడి పడవలు
నంగళ్ల దోనెలు, నట్లు పుట్లు
చందుకా పెట్టెలు, మందున్న కొట్లును
బట్టల కొట్లు చప్పంగముంచె
కారాగృహమ్ములు, కల్లుసారాయీలు
రూపాయ వరహాలు, రూకలు మరి
నేబులు, చెంబులు, నెరపిన మొహారీలు
ముత్యాలు, పగడాలు, మోహనములు
చంద్రహారమ్ములు, జాళువా పెట్టెలు
బాజి బందులు, వజ్రపతకములును
కమ్మల గొలుసులు, కాళ్ళ పాంజేబులు
పిల్లేళ్లు, మణి, జడబిళ్లలు, మరి
కంటెలు, నానులు, కంకణాల్ కడియాలు
ముక్కుపోగులును, చేర్చుక్కబొట్లు
నడుము వడ్డాణాలు, నాను కోళ్లను మరి
రాగిడి, శశి పువ్వు, రంగుమీర
కోట్ల సొమ్ములు పోయి, కోళ్ళను గలిసెను
శరవాలు, బిందెలు, చెంబులు, మరి
కంబాలు, పందిరి మంచాలు, పీటలు,
ఠాట్నాలు, రాజిత రథచయమ్ము

తలుపులు, తాళాలు, తగినట్టి కుర్చీలు
పల్లకీల్ మేనాల నెల్ల ముంచె
పుట్టుబిడ్డలు, స్త్రీలు, పురుషులు, బాలురు
శతకోట్లు కోట్లుగా జలధి గలిసె
పశువులు, లేగలు, బఱ్ఱెలు, దున్నలు
ముప్పద క్షోహిణుల్ మునిగిపోయె
అదిగాక గుఱ్ఱాలు మదపుటేనుంగులు
ఒంటె లద్భుతముగ ఉదధి గలసె
మేకల మందలు, మేలైన గొఱ్ఱెలు
పొట్టేళ్ళు, కొట్టుకపోయి వచ్చె
పులు లెలుంగులు మను బోతులు, దుప్పులు
బలువైన కొండముచ్చులును జచ్చె
సద్గారుపోతులు, చమరీమృగంబులు
కుక్క నక్కలు, శివంగులును జచ్చె
పిల్లలు, పెద జంగు పిల్లులు, బల్లులు
దండినాగంబులు, కొండశిలలు
తొండలు, యెలుకలు, తోరంపు బల్లులు
మక్షికాల్, మత్కుణల్ మణిగిపోయె
చీమలు దోమలు, చిందరొందగ జచ్చె
పక్షుల వేర్వేర పట్టి యిత్తు
గరుడ కులంబాది, గద్దలు, కాకులు
కొంజులు, పూరేళ్లు, కొక్కిరాళ్లు
లావులీల్, ఖర్జాలు, లకుముకి దొంతరల్
శుకపికంబులును, పిచ్చుకలు జచ్చె

స్వాతి కొంగలు, జాళువా బహిరీళ్లు
కొంగలు, కార్కోళ్లు కూలిపోయె
పంగులు, కంకణాల్ పారనేత్రంతాలు
గిజిగాళ్లు కేకిరాల్ కేకి చయము
నేల తప్పిటలు, పిట్టలును గోర్వంకలు
పొన్నంగలున్ తిక్క తీతువులును
పత్తిరాట్నంబులు, బందులు, పావురాల్
గుడ్లగూబలు చాల కూలిపోయె.
గూడూరుమీదుగా గుండేరు, మిళితమై
అందందు చనుదెంచి, అద్భుతముగ
సింగారమైనట్టి రంగారు బంగారు
పంటశాలను జేసె, ఘంటశాల
పాలంకపాటిపై పదపడి, ముత్తేవి
కోనూరు కాటికి కొనయు సాగి
కనకదుర్గమ్మ ముక్కర తీతునని పూనె
వాడపల్లియు గాంచి వార్ధిముంచె
చిక్కని చక్కని స్త్రీ శవంబుల జూచి
మొగమెత్తి యేడ్పుల మొనయువారు
పట్టెమంచాలపై, పతి సతి రతి, గూడి,
వదలక కొట్టుక వచ్చువారు
పైపై నగలు తీసి, పట్టెడల్ ద్రుంచుచు
నీళ్లు గ్రక్కగ, జంకి నీల్గువారు
సొమ్ముమీ దాశను, నమ్మి విడువగ లేక
దయ్యంబులై వెంట దగులు వారు

బ్రహ్మ రాకాసులై బ్రాహ్మణ స్వాములు
నిశి యందు సంత వర్లించువారు
ఘన పిశాచంబులై, పెను లోభ మనుజులు
తెగ గొల్పి పంచుక తినెడివారు
సీ॥ ఈ విధమ్మున రాణమ్మ కెరుక జేసి
సీమ లోపల రాణమ్మ శెలవు మీద
కోటి యజ్ఞ ఫలమ్ము చేకూరినట్లు
శవములన్ కోటులాదిగ సార్థకముగ
గోత పెట్టించె, పుణ్యమ్ముగోరి, గాంచి
పేదలకు నిల్లు గట్టించి పెట్టి, యెన్నొ
శుద్ధ మొహరీలు వరహాలు, సొమ్ములిచ్చె
అయ్యగొనుమయ్య సీస పద్యమిదయ్య
శాంతి చేకూర్పు మికనైన చల్లనయ్య
రాయభట్ వీరరాఘవ రాజు, వరద
మోదుకూర్ వేణుగోపాల! మురళిలోల!

ది 19-11-1977.

# ఉప్పెన.

## కడలిపొంగు.

గాలివానకు, జోడైన కడలిపొంగు
కక్షబూనిన రాకాసి కాళరాత్రి
దివిని, కబళింప, మడసిరి - దీన జనులు

సీ॥ హంసలదీవిని హింసల పాల్జేసి
నక్కవాని త్రోవ నడుము విరచి
గొల్లపాలెమునెల్ల గొల్లున యేడ్పించి
బసవన్న పాలెంబు భగ్నపరచి
మందపాకల, నేల మట్టంబు గావించి
పాదాని పాలెంబు పాడుజేసి
భావదేవరపల్లి, బావురుమనిపించి
పోటు మీదను వెన్నుపోటు పొడిచి
కమ్మనవోలును, కంగారు పడజేసి
ఉపకారి గ్రామాలు నూడ్చివైచి
నాలి గ్రామంబును, నాశన మొనరించి
గణపేశ్వరంబును గంగ గల్పి
సొర్లగొందిని తాకి, సుడిగుండమొనరించి
మూల పాలెంబును, ముంచివైచి
పర్ర చివర, పలు బాధల పాల్జేసి
గొల్లలమోదను, గుల్లజేసి
ఎదురు మొండి సిరుల, నేటి పాలొనరించి
ఏటి మొగను, వెన నీట ముంచి

గీ॥ వేలకొలదిగ పశువుల, నేల గూల్చి
చెట్టు పుట్టకు నొక్కని చేర్చి చేర్చి
ఘోర ఘోరాతి ఘోరమౌ, ఘోర కలిని
కలుగజేసెను, రాకాసి, కడలిపొంగు.

*డా॥ బి. వి. ఆర్. ప్రసాదరావు.*



దివిసీమ-దీనదయాళపురంలో నిర్మించిన 1977 ఉప్పెన స్మారకస్తూపం

వైద్య సహాయక బృందములు, సైనిక వైద్య బృందములు, ఇండియన్ మెడికల్ సంఘము, రెడ్ క్రాసు సొసైటీ, యితర అనేక స్వచ్ఛంద వైద్య సంస్థలు, ప్రభుత్వ వైద్య శాఖ వారి పర్యవేక్షణ క్రింద, సేవా కార్యక్రమములు నిర్వహించిరి. ఈ యిందర వందర స్థితిలో, సాంక్రామిక వ్యాధులు ప్రబలుట సహజమైనను, యే విధమైన, సాంక్రామిక వ్యాధి, ఒక్క కలరా వాధి కూడ లేకుండా సేవ చేయ కలిగిరి. లక్షల విలువగల ఔషధములు, యీ బృందముల ద్వారా గ్రుమ్మరింపబడినవి.

ఉప్పెనచే, నీరంతయు ఉప్పన కాగా, త్రాగుటకు నీరు అలభ్య మైంది. ఉప్పెన తరువాత, పది దినముల లోగా 350 బోరింగు పంపులు వేయబడినవి. 50 నీటి తొట్టె టాంకర్లు, యింజను బండ్లపై, క్లోరిన్ గలిపిన మంచి నీళ్లు, దూర దూర గ్రామములకు అందించిరి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, కొందరు వ్యక్తులు, తాము రొక్కము పూర్వకముగ, వస్తు పూర్వకముగ వసూలు చేసినవి తెచ్చి యిచ్చి, యీ సేవా కార్యక్రమమునకు దిగిరి. Casa, Care-వారు తాత్కాలిక గృహ ములు నిర్మించిరి. అటవీ శాఖవారు దాదాపు 135 ప్రజా సాముదాయక కుటీరములు నిర్మించిరి. పాకల నిర్మాణమునకు, ప్రభుత్వము, ఒక కోటి, తాటియాకులు, 25 లక్షల వాసములు, ఒక లక్ష కట్లు, (కట్టు త్రాళ్లు) సప్లయి చేసినది. స్వల్ప కాలములో, యింత యింతలేసి పెద్ద గృహములకు కావలసిన బృహత్ వస్తు సముదాయము సేకరించి, ఆయా స్థానాలకు చేర్చి, పంపిపెట్టుట, అనే బృహత్ కార్యము, ప్రజ లకు చూడ యూహింపరానిదనుట సహజము. తరువాత నిర్వహింప వలసిన కార్యక్రమ మెద్దియన, ఈ నిర్వాసితులకు గృహముల నిర్మాణము, బాటలు వేయుట భవనములు నిర్మించుట, వ్యవసాయ

కాలువలు, మురుగు కాల్వలు, మరమ్మతు చేయించుట, జలాశయము లకు, చెరువు, గుంటలు మంచినీరు నింపించుట, సముద్ర రేవుల మరమ్మతు చేయించుట మొదలగునవి. ఈ కార్యక్రమములు చేబట్టు టకు ముందు ఒక విషయము గుర్తుంచుకొనవలె. ఈ సముద్ర తీర గ్రామములకు అనాదిగా, సంభవించు, తుఫాను, ఉప్పెనల తరువాత, అప్పటికప్పటి, అంచనాలు మాత్రమే కాని, బాటలు లేవు. ఈ మారు మూల స్థలములకు, జనానికి వస్తు సముదాయము చేర్చుట యెట్లు? నమ్మండి! నమ్మకపోవండి :- మురుగు కాల్వలు త్రవ్వబడినవి, పొలములు సాగుకు లాయఖుగా బాగు చేశారు - రోడ్లు నిర్మించారు. ఆయా తావులకు నడచివచ్చిన గ్రామస్థులలో కొందరు సమర్థుల సహాయముచే, నీటి సరఫరా జరిగింది. దీని తరువాత పునరావాస కార్యక్రమము మాట ఆలోచించవలె. ప్రభుత్వము రు. 2050 లక్షలు వ్యవసాయోత్పత్తికి, రహదార్లకు, కట్టడములకు పంచాయతీ సంస్థలకు ఖర్చు పెట్టింది. గండ్లు పడిన, కరకట్ట మరమ్మతులకు, 135లక్షల రూపాయలు ఖర్చు అగునని అంచనా వేసిరి. పునర్నిర్మాణమునకు ఖర్చు రు. 165 లక్షలయింది. అదంతట అదే మట్టి యెత్తి అందించు యాంత్రిక యింజనుల సహాయముచే 75 దినములలోనే నిర్మించగలిగిరి.

ముఖ్యముగ, యీ ప్రాంతములో నష్టపడింది జాలరులు. వారల కొంప, గోడి, సర్వం నాశనమైనది. మరల క్రొత్తగా సర్వము యేర్పరచుకొనవలె - 1364 చేపలపట్టు నావలు, వలలకు 52 వేల కేజీల నైలాను దారం, 9360 పెట్టెల దూది దారం, 18వేల కిలోల రు. 122 లక్షలు ఖరీదు చేయు ముతుక త్రాడు, వారికి పంచిపెట్టిరి. విపత్తు తరువాత కొలది మాసములలోనే, పునరావాసమునకు వీరికి తగు యేర్పాట్లు చేసిరి.

పోలీసు గృహ నిర్మాణ కార్పొరేషన్ ప్రధాన మంత్రి బాధితుల సహాయనిధి నుంచి, యిచ్చిన రు. 15 లక్షల మొత్తములో కొత్త సాముదాయక నివాస గృహముల నిర్మాణమునకు పూనుకొన్నది. అప్పటికప్పుడు కొలదిమంది ఆఫీసర్లతో పోలీసులు వచ్చి, ఈ కార్య క్రమము పూర్తియగు వరకు పనిచేసిరి. ఇక్కడ సొర్లగొందిలో, క్రొత్త కట్టడముల నిర్మాణ ఖర్చుల వినియోగము గురించి చెప్పవలసి యున్నది. కేంద్రం, ప్రణాళిక క్రింద కేటాయించిన రు. 24,863 లక్షల విరాళము క్రింద - జిల్లా పరిషత్తు వారికి రు. 62.5 లక్షలు యిదివరకే అందజేసిరి. అందు నిర్వహించిన పనుల క్రింద - ఆ స్థలాలకు జేరు ముఖ్యమైన రోడ్ల క్రింద రు. 12 లక్షలు, మంచినీటి సరఫరాకు రు. 1.25 లక్షలు, చేపల శుద్ధి స్థలమునకు రు. 0.92 లక్షలు, రాకపోకల ప్రయాణములకు రు. 1.646 లక్షలు, మంచు గడ్డకు రు. 3.642 లక్షలు, ప్రజాసాముదాయక భవనమునకు రు. 5.40 లక్షలు. ఇవి భారత గ్రామ పునర్నిర్మాణ పథములో మైలు రాళ్ళనుట సమంజసము కదా !

వ్యవసాయక, నీటిపారుదల శాఖలు, తుఫాను దెబ్బతిన్న 90 వేల యకరముల భూమిలో, 25 వేల యకరములు రబీ పంట సాగుకు తీసికొని రాగలిగిరనిన అట్టివారి నేమాత్రము తక్కువగా గణింపలేము. సముద్రపు ఉప్పు నీటిలో మునిగిన వాటిపై, మంచి నీళ్లు నిల్వకట్టి, కారు ఉప్పుదనము, పోగొట్టి, మంచి భూము లుగా తయారుచేయుటకు రు.244 లక్షలు, ముందు పెట్టుబడి పెట్టబడెను. ఈ సాధనలన్నిటిచే భూములు ఖరీఫ్ పంటకు లాయకుగా తయారైనవి. చేనేత పని వారు, సన్న నూలు మగ్గాల శాఖవారు, నేతగాంధ్రకు 9643 మందికి రు. 15 లక్షల ఖరీదు

చేయు మగ్గాలు అందించిరి. 10,364 మంది మంచి నేతగాం(డ్రకు, నూలు కొనుగోలు కొరకు, అప్పుగా రు.10 లక్షలు యిచ్చిరి—

విద్యా సంస్థలు రు. 265 లక్షల ప్రభుత్వ విరాళములతో బాగుచేయబడినవి - ఉన్నత పాఠశాలలు, కళాశాలల జీతము రు. 33 లక్షల మొత్తమునకు పెంచిరి—

పారిశ్రామిక శాఖవారు, ఆ పాడువడిన ప్రదేశముల బాగు సేతకు, 6 వేల టన్నుల సిమెంటు, 503 టన్నుల జి. ఐ. రేకులు, 150 టన్నుల ఎ. సి. రేకులు, సప్లయి చేయుటయేగాక నూటికి 4.1 సామాన్య వడ్డీ చొ॥ రు. 35 లక్షల అప్పులు మంజూరు చేసిరి. ఖాదీ బోర్డు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, 3000 కళాకారులకు (శిల్పులకు) రు. 20 లక్షల మేరకు ఆర్థిక సహాయమందించిరి.

వందల కొలది అనాథ పిల్లలను గురించి, మచిలీపట్టణములో నిర్మించిన అనాథ శరణాలయములో పునరావాస మేర్పరచినారు.

రామకృష్ణమిషన్, రాష్ట్ర స్వయం సేవక సంఘము, విశ్వ హిందూ పరిషత్, రెడ్‌క్రాసు సొసయిటీ, తాతా ధర్మ సంస్థ మొదలగు 30కి మించిన స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ మిచ్చిన, భూరి విరాళ ముతో కలసి 10,500 పక్కా గృహములు నిర్మించిరి. 20 సంస్థ లప్పుడే, 8 వేల గృహ నిర్మాణము పూర్తిచేసినవి. పోలీసుశాఖ, రోడ్డు రవాణా శాఖ, సాంఘిక సంక్షేమ శాఖలు 2600 గృహముల నిర్మాణమునకు పూనుకొనిరి. వీటికి మించి 12 సంస్థలవారు, 23 ఇతర గ్రామములలో 3600 గృహముల నిర్మాణమునకు పురోగ మించిరి. ఈ లెక్క లన్నింటి ప్రకారము మొత్తము రు. 5 కోట్ల పెట్టుబడియగును. ఒక్కొక్కదానికి రు. లక్ష ఖర్చుతో షుమారు 100

ప్రజా సాముదాయక గృహములు కట్టబడును. తమ యిరుగు పొరుగు జీవగణముపై, పొంగి పొరలే శాశ్వత దయాదాక్షిణ్య రూపు రేఖలివి.

మనమందర మొక గుణపాఠము నేర్చు కొన్నాము. ప్రభుత్వము, స్వచ్ఛంద సంస్థలు కలసికట్టుగా పని చేయు విషయము గమనించిన, వారు దేశానికి, యెంతయో గొప్పమేలు చేకూర్చగలరని; యీప్రాంతము చూడ చనుదెంచిన, ముఖ్యమంత్రిగారి సంతోష ప్రవచనములు ఈ సేవాకార్యక్రమము, ఆంధ్రదేశ పరిపాలనా దక్షతకు సూచనగా సంతోషించినా మన్నారు.

ఈ విపత్తు తరువాత, గడచిన, 11 మాసముల తరువాత ప్రపంచ ఐక్యరాజ్యసమితి, ప్రత్యేకముగ పంపిన పత్రికా ప్రతినిధి, పునరావాస గృహనిర్మాణములో కానవగు, మహత్తర అభివృద్ధి కచ్చెరువంది, దీనికి ఆంధ్రా అద్భుత సృష్టియని పేరిడిరి —

ఈ నిర్మింపబడిన కాలనీలు (వాడలు) వెలసిన, ప్రజాసాముదాయక నివాసములు, ఒకనియమిత స్వల్పవ్యవధిలో, సముద్రతీరము పొడవున, కొనవరకు, నిర్మించిన రోడ్లు, విద్యుద్దీపములు, నీటి సరాఫరా మొదలగునవెన్నియో ఆకర్షణీయకముల గమనించిన, యేరైన యిట్టివి, మామూలు పరిస్థితులలో సంభవమగునా, అని సందేహింతురు. కాని యిది తుఫాను, అజ్ఞాతముగా ప్రసాదించిన వరప్రసాదమేమో యని రూఢియగును.

# బృందావన ప్రసూనములు

1. **శ్రీ వాసుదేవ నామ శతకము** (చతుర్థ ముద్రణము)
శ్రీ కృష్ణాష్టోత్తర శతనామముల ననుసరించి ఒక్కొక్క పద్యమునం దొక్కొక్క నామార్థమును గూర్చి వ్యాఖ్యాన ప్రాయముగా వ్రాసిన భక్తిప్రబోధాత్మక శతకము. 1-00

2. **ముకుందమాల** (చతుర్థ ముద్రణము)
శ్రీ కులశేఖరాళ్వారుల సంస్కృత ముకుందమాలకు పద్యానువాదము 60 శ్లోకములు, పద్యములు, తాత్పర్యసహితము 1-50

3. నవకాళి (ద్వితీయ ముద్రణము)
గాంధీ మహాత్ముని అహింసా విజయయాత్ర - భీభత్స భయానక, కరుణరస ఖండకావ్యము 0-60

4. కల్పలత (చతుర్థ ముద్రణము)
వినతి, సందర్శనము, వాత్సల్యము, పోతనామాత్యుడు - గోపికాహృదయము, వేడికోలు, శ్రద్ధాంజలి, గ్రహస్తవము, కల్పలత మొదలగు నవశాఖల విరాజిల్లు ఖండకావ్య సంపుటి. 6 విశ్వవిద్యాలయములచే బి. ఏ. పాఠ్యగ్రంథముగా నిర్ణయింపబడిన సరళగ్రంథము. మేలు ప్రతి 4-00
సాధారణ ప్రతి 3-00

5. స్వాతంత్ర్యపథము జాతీయోద్యమ పద్యములు, గేయములు. స్వాతంత్ర్య సంపాదనకు ముందు, తదుపరి భారత జాతీయోద్యమము, ఆంధ్రోద్యమము నందు కవులగురించి, ఉత్సాహము పురిగొల్పు పాటలు, పద్యములు 5-00

6. శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము
శ్రీ మహాలక్ష్మీ స్తవము-శ్రీసూక్తము ఆంధ్ర పద్యానువాద సహితము

7. అంజలి
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీ మచ్ఛంకర భగవత్పాదప్రతిష్ఠిత శ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతి శ్రీ జగద్గురు శ్రీ మచ్చంద్రశేఖరేంద్ర సరస్వతీ పూజ్య పాదుల మహిమ, సందర్శనము, పర్యటనా విశేషముల గూర్చిన పద్యసంపుటి.

# రాబోవు గ్రంధములు

1. సిద్ధేంద్రయోగి (నాటకము)
కూచిపూడి భరతనాట్య గురువులు, సుప్రసిద్ధ కవీంద్రులు నగు సిద్ధేంద్రయోగి జీవితచరిత్ర. యక్షగాన, సహితము.

2. పవిత్ర యాత్రావలోకన (పద్యసంపుటి) భారతదేశ మందలి ఉత్తర దక్షిణ పవిత్ర యాత్రాస్థలముల సందర్శనము, మహాత్మ్యం మొదలగు విశేషములతో కూడిన పద్యకావ్యము.

3. భక్తిరసైక స్తోత్రసంపుటి - శ్లోకములు, అనువాదపద్యములు గేయములు సహితము.

4. భ్రమరగీతలు - ఖండకావ్యము (పద్యములు)



## కవిశేఖర - శ్రీ గురుజాడ రాఘవశర్మ

జననం. 11-2-1899; స్వాతంత్ర్య సమరయోధులు, వక్త, కవిశేఖరులు, జాతీయ కవి, "ముకుందమాల, వాసుదేవనామ శతకము, కల్పలత, నవకాళి, అంజలి, శ్రీ లక్ష్మీస్తవము, స్వాతంత్ర్య పథము"లు. వీరి కృతులు.

'కల్పలత' ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర, చెన్నపురి, మైసూరు, ఉత్కళ, ఉస్మానియా విశ్వ విద్యాలయములలో పాఠ్య పుస్తకముగ యెన్నికగన్నది.

సహకారోద్యమము, ఖాదీ, కలంకారీ, యుద్యమ ప్రచార ఖ్యాతి గొన్నవారు.

ప్రఖ్యాత జ్యోతిషశాస్త్ర పండితులు, పరిశోధకులుగా, పలువురి ప్రశంసల నందుకొన్న నిరాడంబరులు. వీరికి పోతన్నగారు కవితా గురువులు. తెలుగు ప్రపంచ మహా సభలలోను, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ జాతీయగీతముల సంపాదకునిగాను సన్మానము పొందినారు.

ఈ పుస్తకము 22 తుఫానుల చరిత్రతో, పద్యములతో వెలువడిన ఖండకావ్యము.